మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం
WEDNESDAY
9-9-2026

జగిత్యాల JAGITIAL || పేజీలు: 12 PAGES:12 || వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 72 Issue: 72

09 సెప్టెంబర్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి త్రయోదశి మ. 12:32 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఆశ్లేష మ. 3:13 వరకు తరువాత మఖ యోగం శివ రా. 9:47 వరకు కరణం వనిజ మ. 12:32 వరకు విష్టి రా. 11:32 వరకు వర్జ్యం తె. 4:41 నుండి ఉ. 6:11 వరకు దుర్ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:37 వరకు రాహుకాలం మ. 12:13 నుండి మ. 1:45 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:10 వరకు గుళికాకాలం ఉ. 10:41 నుండి మ. 12:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు మ. 1:42 నుండి మ. 3:12 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## తాతా మధు, నవీన్ రెడ్డి సస్పెన్షన్




### ఈ సమావేశాలకు మొత్తంగా సస్పెండ్: మండలి ఛైర్మన్

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది.**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన తరువాయి 2 వ పేజీలో...



## టెట్ పాసైతేనే టీచర్

### అర్హత లేకపోతే నియమించొద్దు.. సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

**విద్యా సంస్థల్లో అర్హత లేని ఉపాధ్యాయుల నియామకాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విద్యా హక్కు చట్టం, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ చట్టం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం నిర్దేశిత అర్హతలు లేని వ్యక్తులను పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించరాదని స్పష్టం చేసింది.**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అస్సాం ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా, పారదర్శకత లేకుండా ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. చట్టపరమైన నిబంధనల ప్రకారం అనర్హులను ఉపాధ్యాయులుగా నియమించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా తరువాయి 2 వ పేజీలో...

## కేసీఆర్ హత్యకు రేవంత్ కుట్ర

### కాంగ్రెస్ శ్రేణులవి అరాచక క్రీడలు
### ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు
### కేటీఆర్ తీవ్ర జ్వరం



హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి -2 వ పేజీలో...

# కేసీఆర్ చావాలె!

### కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలు.. బీఆర్ఎస్ నేతల ఆగ్రహం, ఫిర్యాదు

**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఉద్దేశించి కాంగ్రెస్ నేత, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ చావును కోరుకుంటున్నామంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో గులాబీ నేతలు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఇప్పటికే రాజకీయ విమర్శలు తీవ్రంగా కొనసాగుతున్నాయి.**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్రంగా మారాయి. కేసీఆర్‌ను ఉద్దేశించి ఆయన తీవ్ర పదజాలం ఉపయోగించారని.. కేసీఆర్ మరణాన్ని ఆయన కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ ఇంటి వద్ద వెయ్యి డప్పులు మాత్రమే కాకుండా.. అవసరమైతే చావు డప్పు కూడా కొడతామంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యానించినట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. వాటికి సంబంధించిన వీడియోలను కూడా షేర్ చేస్తున్నారు. తెలంగాణకు పట్టిన శని కేసీఆర్ అంటూ ఎమ్మెల్యే విమర్శలు చేసినట్లు తెలిపారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి స్థాయిలో ఉన్న వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. వీర్లపల్లి శంకర్ తరువాయి 2 వ పేజీలో...





## భారత్ వైపు ప్రపంచం చూపు!

### సవాళ్లు ఉన్నా ఉన్నతంగా దేశ ఆర్థికం
### ప్రధాన మంత్రి మోదీ కీలక వ్యాఖ్యలు

**అంతర్జాతీయంగా యుద్ధ భయాలు, వస్తు సరఫరా అవాంతరాలు, ముడిచమురు సంక్షోభం వెంటాడుతున్న తరుణంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన ప్రతిభను కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశం 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటును నమోదు చేయడం, ప్రపంచ దేశాలకు నూతన ఆశలను నింపుతోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ముంబైలో జరిగిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్' మూడో విడత సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు.**

ముంబై: గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికం ప్రపంచవ్యాప్తంగా వ్యాపార రంగానికి అత్యంత సవాలుగా మారిందని ప్రధాని అన్నారు. ఇంధనం, నిత్యవసర వస్తువుల సరఫరా వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ 7.8శాతం వృద్ధిని సాధించడం మన ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి, సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు. జపాన్ ఏజెన్సీ నుంచి రికార్డు రేటింగ్: దాదాపు మూడు దశాబ్దాల (30 ఏళ్ల) తర్వాత జపాన్‌కు చెందిన ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు 'ఏ క్యాటగిరీ' సావరేన్ రేటింగ్‌ను కేటాయించిందని ప్రధాని తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,415 |
| వెండి (కిలో): | రూ.2,,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,454 |

## రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే

### మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు హేయం
### బీజేపీ ఎంపీ డీకే అరుణ మండిపాటు



*అసెంబ్లీ ఆవరణలో మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయం అని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు ఇంత అనుచితంగా ప్రవర్తించడం తీవ్రంగా ఖండించదగినది. బాధ్యులైన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని అరుణ డిమాండ్ చేశారు.*

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఈ మేరకు ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. అసెంబ్లీ గేటు వద్ద మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై పోలీసులు ప్రవర్తించిన తీరు చాలా హేయమైనది. మహిళా ఎమ్మెల్యేల పట్ల అసెంబ్లీ ఆవరణలో పోలీసులు అంత అనుచితంగా ప్రవర్తించడం సరికాదు. ఎవరి ఆదేశాల మేరకు పోలీసులు అలా ప్రవర్తించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకా..? ఈ చర్యలపై హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి కొంచెమన్న సిగ్గు అనిపిస్తలేదా..? స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలకు ఏ విధంగా క్షమాపణ కోరుతున్నారో, వారి మీద చర్యలు తీసుకోవాలని చర్చ చేయడంతరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



అల్జీమర్స్ వ్యాధి అభివృద్ధికి ఇంతవరకు పెద్దగా గుర్తించని కీలక కారణాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. జీఆర్‌కే2 అనే నియంత్రణ ప్రోటీన్ అసాధారణంగా గుంపులుగా ఏర్పడి మెదడు కణాల్లోని శక్తి ఉత్పత్తి కేంద్రాలైన మైటోకాండ్రియాను దెబ్బతీస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. దీంతో నాడీకణాల్లో ఒత్తిడి పెరిగి, అమైలాయిడ్ బీటా ఉత్పత్తి కూడా అధికమవుతున్నట్లు తేలింది. ఫలితంగా మరింత జీఆర్‌కే2 గుంపులు ఏర్పడి కణాల నష్టాన్ని వేగవంతం చేసే దుష్చక్రం కొనసాగుతుంది.



## 11న మోదీ, పుతిన్ భేటీ

### ద్వైపాక్షిక అంశాలపై చర్చ.. 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

న్యూఢిల్లీ: బ్రెజిల్, చైనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇండియా, ఇండోనేసియా, ఇరాన్, రష్యా, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన 'బ్రిక్స్'శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ నెల 12, 13న ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే సమావేశానికి కూటమి దేశాల అధినేతలు హాజరుకాబోతున్నారు. సదస్సు కంటే ఒక రోజు ముందు ఈ నెల 11న భారత ప్రధాని తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

9.9.2026

**మేషం:** వ్యాపారమున సొంత నిర్ణయాలతో లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం పొందుతారు.చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. బంధువులతో విభేదాలు తొలగుతాయి.

**వృషభం:** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మిత్రులతో వివాదాలు మానసికంగా చికాకుగా కలిగిస్తాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో కొంత అసంతృప్తి తప్పదు. ముఖ్యమైన వ్యవహారాలలో కష్టించినా ఫలితం కనిపించదు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు ఉంటాయి.

**మిధునం:** వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమవుతుంది. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం లభించదు. కుటుంబ వ్యవహారాల్లో తొందరపాటు పడకూడదు.

**కర్కాటకం:** స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారమున అంచనాలు అందుకుంటారు. ఉద్యోగాలలో సమస్యలు తీరుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**సింహం:** ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. బంధువుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలమవుతాయి. భాగస్వామితో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

**కన్య:** ఉద్యోగమున ఉన్నతాధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. విద్యార్థుల శ్రమ ఫలించదు. చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. బంధువర్గంతో వివాదాలు తప్పవు.

**తుల:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

**వృశ్చికం:** పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

**ధనస్సు:** సోదరులతో స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. సన్నిహితులతో మాట పట్టింపులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

**మకరం:** విలువైన వస్తు వాహన లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలను అందుకుంటారు.

**కుంభం:** వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు తప్పవు. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో విభేదాలు తప్పవు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

**మీనం:** వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కొత్త వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.

# తాతా మధు, నవీన్ రెడ్డి సస్పెన్షన్

మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

### రిమాండ్‌కు కోర్టు నో

తెలంగాణ శాసనసభ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల కేసులో అరెస్టైన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని రిమాండ్‌కు తరలించాలన్న పోలీసుల అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో వారిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. సభాధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎమ్మెల్సీలపై ఉన్నాయి. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ అభ్యర్థనపై న్యాయస్థానం ఇరువర్గాల వాదనలు విన్నది. అనంతరం పోలీసుల అభ్యర్థనను తోసిపుచ్చింది. నిందితులు ఇద్దరూ రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలను వెంటనే విడుదల చేయనున్నారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనపై పోలీసులు తీసుకున్న చర్యలకు ఇది ఎదురుదెబ్బగా మారింది.



### టెట్ పాసైతేనే టీచర్

మొదటి పేజీ తరువాయి

కొనసాగించడానికి వీల్లేదని పేర్కొంది. అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని ధర్మాసనం ఈ సందర్భంగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. టెట్, నెట్ వంటి జాతీయ స్థాయి అర్హత పరీక్షలు పాసైన వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించుకోవాలని తేల్చి చెప్పింది. అర్హత లేని టీచర్ల నియామకంపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# కేసీఆర్ చావాలె!

మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. శంకర్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత మాటలు కాదని.. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు ప్రతిబింబమని ఆరోపించారు. కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నారని చెప్పించేందుకు అధికార పార్టీ నేతలను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో అసెంబ్లీలో వేముల వీరేశం చేసిన వ్యాఖ్యలను.. తాజాగా వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆయన కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోలీసులను ఆశ్రయించారు. వీర్లపల్లి శంకర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ప్రాణహాని కోరుకునే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. వ్యాఖ్యలపై సమగ్రంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. మరోవైపు.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డప్పులతో వెళ్లిన ఘటనపై కూడా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నేతలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లడం.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. దీంతో కేసీఆర్ భద్రత విషయంలో బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### కేసీఆర్ ఫాంహౌస్ వద్ద 144 సెక్షన్

గజ్వేల్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యల తీవ్ర పర్యవసానాలు ఇప్పుడు కేసీఆర్ ఫాంహౌస్ వరకు పాకాయి. గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవెల్లి గ్రామంలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ ను ముట్టడించేందుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ పిలుపునివ్వడంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ నిరసనకారుల యత్నాలను, ఇరువర్గాల ఘర్షణలను అడ్డుకునేందుకు పోలీసులు ఎర్రవెల్లి పరిసర ప్రాంతాల్లో తక్షణమే 144 సెక్షన్ విధించారు. ఫామ్‌హౌస్ వైపు వెళ్లే అన్ని ప్రధాన రహదారులను బారికేడ్లతో దిగ్బంధించి, పోలీసు వాహనాలతో పహారా కాస్తున్నారు. ఇదే సమయంలో ఎర్రవెల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ధర్నా శిబిరాన్ని పోలీసులు బలవంతంగా ఎత్తివేయడంతో పరిస్థితి రణరంగంగా మారింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల సవాళ్లు, పోలీసుల మోహరింపులతో ఎర్రవెల్లి పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

# కేసీఆర్ హత్యకు రేవంత్ కుట్ర

మొదటి పేజీ తరువాయి

పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

### రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే

మొదటి పేజీ తరువాయి

జరిగింది. మరి మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరుపై ఎందుకు చర్చ చేయడం లేదు. మహిళా ఎమ్మెల్యేల మెడబట్టి, జుట్టు లాగి, చీర పట్టుకుని లాగితే కూడా దానిపై నోరు విప్పరు. ఇంతకంటే దారుణమైనది ఇంకోటి ఉన్నదా..? ఆ పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. మహిళా ఎమ్మెల్యేలకే ఈ పరిస్థితి ఎదురైతే.. సామాన్యులకు ఏదైనా సమస్య వస్తే వారి పరిస్థితి ఏంటో ఊహించుకోవాలంటేనే భయంగా ఉంది అని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో సబితా ఇంద్రారెడ్డి హోం మంత్రిగా, సునీతా లక్ష్మారెడ్డి కూడా మంత్రిగా పని చేశారు. ఇవాళ పార్టీలో వేరు ఉండొచ్చు.. కానీ సాటి ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి ఖండించి ఉండాల్సింది. ఒకరికి ఒక న్యాయం, ఇంకొకరికి ఇంకో న్యాయం అనేది కరెక్ట్ కాదు. మహిళల పట్ల నీకు ఇంకా గౌరవం ఉండాలి. ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యేలకే గౌరవం లేకపోతే, సామాన్య మహిళల పరిస్థితి ఏంటి..? ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి. అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నానని డీకే అరుణ పేర్కొన్నారు.

### భారత్ వైపు ప్రపంచం చూపు!

మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. భారత స్థూల ఆర్థిక స్థిరత్వం, వేగవంతమైన వృద్ధి, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలపై ప్రపంచానికి ఉన్న నమ్మకానికి ఇది ప్రతీక అని పేర్కొన్నారు. ఆగని సంస్కరణల రథం: రాబోయే రోజుల్లో దేశీయ సంస్కరణలు మరిన్ని వేగవంతం అవుతాయని మోదీ స్పష్టం చేశారు. 'ఇండియాస్ రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్ ఇకపై మరింత వేగంగా దూసుకెళుతుంది' అని ప్రధాని పునరుద్ఘాటించారు. యూపీఐ ప్రారంభమై 10 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని ప్రధాని గుర్తుచేసుకుంటూ, భారతదేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణం అద్భుతంగా సాగుతోందన్నారు. సింగపూర్‌తో భారత యూపీఐ అనుసంధానమైన రీతిలోనే, రాబోయే రోజుల్లో ఇతర విదేశీ చెల్లింపుల వ్యవస్థలతో కూడా యూపీఐని అనుసంధానించడమే తదుపరి లక్ష్యమని తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌లో బ్యాంకింగ్: ఒకప్పుడు ప్రతీ ఒక్కరి చేతివేళ్లపైనే బ్యాంకింగ్ సేవలందుతాయని తాను చెప్పినపుడు చాలామంది మేధావులు నమ్మలేదని, కానీ నేడు యూపీఐ దానిని నిజం చేసి చూపించిందని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# 11న మోదీ, పుతిన్ భేటీ

మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోదీ, రష్యా అధినేత పుతిన్ ప్రత్యేకంగా భేటీ కాబోతున్నారు. ఈ విషయాన్ని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మంగళవారం నిర్ధారించారు. ఆయన భారత జర్నలిస్టులతో ఆన్‌లైన్‌లో సంభాషించారు. ఢిల్లీలో ప్రధాని మోదీతో అధ్యక్షుడు పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారని తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై వారు దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇరువురు నేతల మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. అత్యంత సున్నితమైన అంశాలపై బహిరంగంగా, నిర్మాణాత్మకంగా చర్చించేలా మోదీ, పుతిన్ ఆచరణాత్మక దృక్పథం, చిత్తశుద్ధి కలిగి ఉన్నారని పెస్కోవ్ వివరించారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో సరిహద్దుల వద్ద నెలకొన్న పరిస్థితులను మోదీకి వివరించడానికి పుతిన్‌కు ఇది మరో అవకాశం కానుందని అభిప్రాయపడ్డారు. రష్యా మార్కెట్‌లో విస్తరణ చర్యలు చేపట్టడానికి, రష్యా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టడానికి భారతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. ఆయా కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలియజేశారు. ఉక్రెయిన్--రష్యా ఘర్షణను ముగించడానికి భారత్ చేసే ఎలాంటి శాంతి ప్రయత్నాలనైనా తాము స్వాగతిస్తామని స్పష్టంచేశారు. చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కారం సాధించాలన్న భారత్ వైఖరికి రష్యా వ్యూహం చాలా దగ్గరగా ఉందని వ్యాఖ్యానించారు.

# రాష్ట్రపతి పాలన విధించాలి

**రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ మంట గలిసింది**

**కేసీఆర్ ఇంటిపై దాడి వికృత చర్య**

**కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకోవాలి**

**మాజీమంత్రి హరీశ్ రావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): తెలంగాణలో లా అండ్ ఆర్డర్ మంట గలిసిందని.. కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకొని రాష్ట్రపతి పాలన విధించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. కలియుగ దుశ్శాసనుడు రేవంత్‌రెడ్డి అని అన్నారు. కేసీఆర్ ఇంటిపై దాడిని వికృత చర్యగా అభివర్ణించారు. రేవంత్‌రెడ్డి భేషరతుగా సమాధానం చెప్పాలన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్ చావాలని అనడం దారుణమన్నారు. ఆయనపై వెంటనే తీర్మానం పెట్టి సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నడు. సభలో చర్చ జరిగితే వైఫల్యాలు బయట పడుతాయని చర్చ జరగకుండా ప్లాన్ చేసిండు. మిస్టర్! రేవంత్ రెడ్డి ఒక్క విషయం గుర్తు పెట్టుకో.. డైవర్షన్ పాలిటిక్స్ తో పేపర్ హెడ్ లైన్స్ మార్చుతావు కావొచ్చు ప్రజల జీవితాలు మార్చలేవు. సోషల్ మీడియా ట్రెండ్ మార్చుతావేమో గానీ, రైతులు, విద్యార్థుల కష్టాలు మార్చలేవు. డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజల తీర్పును మార్చలేవు. డైవర్షన్ పాలిటిక్స్ ఆపి ప్రజల సమస్యలు తీర్చు. నాలుగు వేల పింఛన్ ఏమైందని రైతులు అడుగుతున్నారు. పెంచుతానన్న రైతు భరోసా ఏది అని అడుగుతున్నారు. వెయ్యి రోజులు అయినా నీ ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు. బకాయిలతో సహా చెల్లించాలని ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఏపీ క్రాప్ హాలిడే లేదు, కానీ ఈ చేతగాని దద్దమ్మ సీఎం వల్ల ఇక్కడ క్రాప్ హాలిడే యూరియా యాపులు పెట్టి ప్రజల ఉసురు పోసుకుంటున్నారు. నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి. కరెంట్ ఇవ్వలేక చేతులు ఎత్తుతున్నారు. కేసీఆర్ పాలనలో ఈ సమస్యలు లేవు, మీరు రాగానే ఎందుకు మొదలయ్యాయి. విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం, ఉద్యోగులు పీఆర్సీ, డీఏ కోసం ఎదురు చూస్తున్నారు. కరోనా ఉన్నా, పెద్ద



నోట్ల రద్దు ఉన్నా కేసీఆర్ 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు క్లియర్ చేసారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. 22ఏ పెట్టి రాత్రికి రాత్రి నిషేధిత జాబితాలో పెట్టి ప్రజల గుండెపై బండ వేసారు. స్పీకర్ గారు మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరగలేదని ఎలా అంటారు? యావత్ దేశం చూసింది, మీడియాలో వచ్చింది. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు కాలేదు. ఉల్టా దాడి జరిగిన సునీతమ్మ, సబితమ్మ, కోవా లక్ష్మిపై కేసు పెట్టారు. మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టడం అంటే ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లే. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగి, గొంతు పిసికి అరెస్టులు చేసి వికృతానందం పొందుతున్నడు.

# చావు కోరుకోవడం ఏం రాజకీయం?

**మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగా ఢీకొట్టాలే తప్ప చావు కోరుకోవడం ఏమిటి? అని మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నోటి దురుసుతో ప్రత్యర్థి నాయకులను, కులాలను, వ్యవస్థలను దూషించడం, దుర్భాషలాడటం ఇదే మొదటిసారి కాదు.. అలాంటి నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదు? అంటే ఆయన దూషణలను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా? అని కవిత నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడి ఇంటిపైకి అధికార పార్టీ నాయకులు దండయాత్రకు వెళ్లడం ఏమిటీ? ఒక ముఖ్యమంత్రే తన పార్టీ నాయకులను ఇలాంటి దాడికి ఉసిగొల్పడం ఏమిటి? రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఏం పని చేస్తోంది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయి లు అందక విద్యార్థులు నష్టపోతున్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితాలో తమ భూములు నమోదు అయి రైతులు, ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాక, జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారు. యూరియా దొరకక రైతులు ఆగ్రహంతో ఉన్నారు. జీవో 97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. వరుసగా జరుగుతోన్న అఘాయిత్యాలు, హత్యాచారాలతో భయం భయంగా మహిళలు ఉన్నారు. వసతులు లేక అనేక సమస్యల్లో గురుకులాల విద్యార్థులు ఉన్నారు. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు సహా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఆందోళనలో ఉంటే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండు రోజులుగా విలువైన సభా సమయాన్ని వృథా చేశాయి. రేపటి నుంచి అయినా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలి.. వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి అని కవిత డిమాండ్ చేశారు.

## ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): హనుమాజీపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. అక్షరాస్యత ప్రాధాన్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారికి ఇష్టమైన పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అమృత్‌లాల్, ఉపాధ్యాయులు సతీష్ కిరణ్, జగన్నాథచారి, సరోజ, భవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వేములవాడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సుమారు 100 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వాల్సిన పీఆర్సీని అమలు చేయడంతో పాటు ఆరు డీఏలు, ఎన్‌ఈహెచ్ఎస్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ బకాయిల చెల్లింపులకు ప్రతి నెలా రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాలతో కలిసి హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

## సమతుల్య పోషకాహారంపై అవగాహన

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): సిరిసిల్ల అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'తెలంగాణ రైజింగ్-2047'లో భాగంగా 'ఆరోగ్యకరమైన సమాజం కోసం సమతుల్య పోషకాహారం' అంశంపై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం సౌజన్యంతో చేపడుతున్న 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. శంకర్ విడుదల చేశారు. సమతుల్య పోషకాహారం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులు పోషక విలువలున్న ఆహారం తీసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమతుల్య ఆహారం, పోషక విలువలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహార లోపాల నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. కన్వీనర్ డా. కృష్ణ ప్రసాద్, కో-కన్వీనర్ ఎస్. శివాని, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కె.వై. కరుణ సమన్వయంతో కార్యక్రమం జరగనుంది.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ చాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యేలతో చావు రాజకీయాలు: ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

పోలీసుల ఎదుట యూట్యూబర్ నందన

# నాకేం తెలియదు, అంతా భర్తే చూసుకున్నాడు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): వీసాల పేరిట డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో ప్రముఖ యూట్యూబర్ నందన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వ్యాపార వ్యవహారాలన్నీ తన భర్త మధుకరే చూసుకున్నాడని ఆమె విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన విచారణలో ఆమె పలు కీలక ప్రశ్నలకు సమాధానాలు దాటవేయడంతో, మరోసారి విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. విచారణ అనంతరం ఇబ్రహీంపట్నం సీఐ మీడియాకు వివరాలు వెల్లడించారు. "లుకౌట్ నోటీసుల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు నందనను అదుపులోకి తీసుకుని మాకు సమాచారం ఇచ్చారు. మా సిబ్బంది వెళ్లి నోటీసులు జారీ చేయగా, దాని ప్రకారం ఆమె ఇవాళ విచారణకు వచ్చారు. అయితే, చాలా ప్రశ్నలకు ఆమె నుంచి 'నాకు తెలియదు' అనే




సమాధానమే వచ్చింది. దీంతో ఈ నెల 16వ తేదీన మళ్లీ విచారణకు రావాలని మరో నోటీసు ఇచ్చి పంపించాం" అని ఆయన తెలిపారు. విచారణలో నందన తన వాదనను స్పష్టంగా వినిపించినట్లు సమాచారం. తాను కేవలం ఐటీ ఉద్యోగిని, యూట్యూబర్‌ను మాత్రమేనని, వీసాల కన్సల్టెన్సీతో గానీ, దాని ఆర్థిక లావాదేవీలతో గానీ తనకు సంబంధం లేదని ఆమె చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. కంపెనీ వ్యవహారాలు, వీసాల జారీ, డబ్బుల వసూళ్లు వంటివన్నీ తన భర్త మధుకరే చూసుకుంటాడని, ఆ కంపెనీలో తాను డైరెక్టర్ హోదాలో గానీ, ఉద్యోగిగా గానీ లేనని ఆమె స్పష్టం చేశారు. నందన మొత్తం బాధ్యతను భర్త మధుకర్‌పై నెట్టడంతో ఇప్పుడు ఈ కేసులో ఆయన పాత్రపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో నందన, ఆమె భర్త, మామగారి పేర్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నందన వాంగ్మూలంతో ప్రస్తుతం విదేశాల్లో ఉన్న మధుకర్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు కనిపిస్తోంది. తదుపరి విచారణలో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేసి కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉంది. తన విచారణ ముగిశాక, తన భర్తను విచారణకు పంపిస్తానని నందన చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం భర్త పిల్లలను చూసుకుంటున్నాడని, తాను వెళ్లాక ఆయన భారత్ వస్తాడని ఆమె చెప్పినట్టు వెల్లడించారు. ఈ కేసులో నందనతో పాటు ఆమె భర్త, మామగారిపై కూడా ఫిర్యాదు ఉందని, తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మంత్రుల శాఖలను మార్చాల్సిందే

**ఇదే విషయాన్ని అధిష్ఠానానికి చెప్పా**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.



# తాతామధుపై చర్యలు తీసుకోవచ్చు.. కానీ!

**బీఆర్ఎస్‌లా సస్పెన్షన్ల సంస్కృతి మాది కాదు: స్పీకర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ (ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు



చేశారు. "బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం" అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## రేవంత్ రాజీనామా చేసి రా!

**ఇద్దరం ఉప ఎన్నికలకు వెళదాం.. రేవంత్ రెడ్డికి కౌశిక్ రెడ్డి సవాల్**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "కొడంగల్ స్థానానికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి. హుజూరాబాద్‌లో నేను కూడా రాజీనామా చేస్తా. మళ్లీ జరిగే ఉపఎన్నికలో రేవంత్ రెడ్డి డిపాజిట్ తెచ్చుకుంటే సభ సాక్షిగా ముక్కు నేలకు రాస్తా" అని ఛాలెంజ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, శాసనసభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగించిన భాష, పదజాలం అసహ్యకరంగా ఉన్నాయని, తెలంగాణ సమాజమంతా ఈ అభ్యంతరకర వైఖరిని గమనిస్తోందని మండిపడ్డారు. సభలో ప్రతిపక్ష సభ్యులను గౌరవించకుండా సీఎం ఇష్టానుసారంగా మాట్లాడారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలోనే 'కత్తులతో నరుకుతాం' అని బహిరంగంగా బెదిరింపులకు దిగారని గుర్తు చేశారు. ఇవన్నీ పక్కనబెట్టి తమపై ఎథిక్స్ కమిటీ పేరుతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై కడియం శ్రీహరి చేస్తున్న విమర్శలకు కౌశిక్ రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. "కోట్లాది రూపాయల నిధులతో పాటు బీఆర్ఎస్ పార్టీ బీ-ఫారమ్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వ్యక్తి కడియం శ్రీహరి. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా పదవులు అనుభవించినప్పుడు ఆయనకు లేని నైతిక విలువలు ఇప్పుడు గుర్తుకొస్తున్నాయా?" అని నిలదీశారు. స్వార్థ రాజకీయం కోసం తల్లిలాంటి పార్టీని వీడిన నేతలు తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

## తిరుమల బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

తిరుమల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై కూడా అదనపు ఈవో సమీక్షించారు. ముఖ్యంగా తిరుమల, ఘాట్ రోడ్లు, కాలిబాట మార్గాల్లో మొబైల్ నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేకించి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే గరుడసేవ రోజున మొబైల్ సిగ్నల్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సెల్ టవర్ల పనితీరును సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి సమీక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచి, ఎలాంటి అంతరాయం లేకుండా కమ్యూనికేషన్ సేవలు అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాల నాటికి తిరుమల, తిరుపతి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుండగా, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆధునిక సౌకర్యాలు అందించేందుకు టీటీడీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది.

## స్పీకర్‌ను బెదిరించే హక్కు ఎవరిచ్చారు?: శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): అసెంబ్లీ స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి హరీశ్‌రావు బెదిరింపు ధోరణిలో మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమాదకరమని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీని ఏ రకంగా నడపాలనే దానిపై స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి, "ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు" అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని సూటిగా నిలదీశారు. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌ను బెదిరించేలా వ్యవహరించడం సభా సంప్రదాయాలకే విరుద్ధమని స్పష్టం చేశారు. స్పీకర్‌పై జరిగిన దూషణల వ్యవహారంలో సదరు నేతలు ఏం మాట్లాడారో వీడియో ఫుటేజీల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని తేల్చిచెప్పారు. మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలను ప్రభుత్వం, స్పీకర్ పక్కన పెట్టేస్తున్నారన్న బీఆర్ఎస్ విమర్శలను శ్రీధర్ బాబు పూర్తిగా కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేల అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్‌ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అత్యున్నతమైన స్పీకర్ వ్యవస్థపై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభ నిబంధనలకు కట్టుబడి బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రారంభానికి ఎస్వీ మ్యూజియం

తిరుమల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): తిరుమలలో భక్తులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఎస్వీ మ్యూజియం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ మ్యూజియాన్ని ప్రారంభించేందుకు టీటీడీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఈ మ్యూజియం పనులను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మ్యూజియంలోని అన్ని విభాగాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## బీడీ స్కాలర్‌షిప్ గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 4(ఈవార్తలు): బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు బీడీ కార్మికుల సంక్షేమ సంస్థ అధికారులు తెలిపారు. అర్హత కలిగిన బీడీ కార్మికుల పిల్లలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల కోసం జాతీయ ఉపకార వేతనాల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన అన్ని పత్రాలను సమర్పించాలని, వివరాలను సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఉపకార వేతనాలకు సంబంధించిన పూర్తి వివరాలను జాతీయ ఉపకార వేతనాల పోర్టల్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తికి 0120-6619540 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## దుర్గమ్మ ఆలయ బోర్డులో చిరంజీవి కుమార్తెకు చోటు

విజయవాడ, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, సినీ నిర్మాత కొణిదెల సుస్మితకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు లభించాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డులో ఆమెను ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కన్నబాబు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో సుస్మిత ఇకపై దుర్గమ్మ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామి కానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు కల్పిస్తున్న వసతులు, ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులు, దసరా నవరాత్రులు వంటి ప్రత్యేక ఉత్సవాల నిర్వహణపై ఆమె ట్రస్ట్ బోర్డుకు తగిన సలహాలు, సూచనలు అందిస్తారు. సుస్మిత కొణిదెల 'గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్' బ్యానర్‌పై చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగా రాణిస్తున్నారు. ఇటీవల తన తండ్రి చిరంజీవితో నిర్మించిన 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రంతో ఆమె మంచి విజయాన్ని అందుకున్నారు. ఆసక్తికరంగా సుస్మిత తల్లి కొణిదెల సురేఖ తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు సుస్మితకు కూడా ఏపీలోని ప్రముఖ ఆలయ బోర్డులో స్థానం లభించడం విశేషం.

## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన అధికారి

**సీపీఆర్ చేసిన మంత్రి శ్రీహరి**

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): అసెంబ్లీ ఆవరణలో మంత్రి వాకిటి శ్రీహరి మానవత్వం చాటుకున్నారు. నవీన్ మిట్టల్ పీఎస్ రాజు అకస్మాత్తుగా అక్కడే కుప్పకూలడంతో మంత్రి వెంటనే స్పందించారు. ఆయనకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం వైద్య సిబ్బందిని పిలిపించిన మంత్రి.. రాజుకు వెంటనే వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. అంబులెన్స్ రప్పించి బాధితుడిని ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ లాభం లేకపోయింది. మార్గమధ్యంలో అంబులెన్సులోనే పీవీ రాజు తుది శ్వాస విడిచారు. అసెంబ్లీ ఆవరణలో రాజు కుప్పకూలిన వెంటనే మంత్రి శ్రీహరి స్పందించిన తీరుపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో వెంటనే స్పందించి సీపీఆర్ చేయడాన్ని అభినందిస్తున్నారు.

# టీజేఏపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొమ్మకంటి శ్రావణ్ కుమార్

## తెలంగాణ జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర కార్యవర్గం విస్తరణ.. ఉత్తర్వులు జారీ చేసిన జేఏసీ చైర్మన్ తొగరి కరుణాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): జర్నలిస్టుల ప్రాథమిక హక్కులు సాధించుకోవడానికి స్థాపించిన జేఏసీ తెలంగాణ జర్నలిస్టుల జేఏసీ అని చైర్మన్ తొగరి కరుణాకర్ ఒక ప్రకటన తెలిపారు ఈ సందర్భంగా మంగళవారం రోజున రాష్ట్ర కార్యాలయం నుండి రాష్ట్రస్థాయి కార్యవర్గ విస్తరణ ప్రకటించారు.. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి వేణు, ముత్యాల రమేశ్‌ను నియమించారు. అలాగే రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బుంగ చాందిని, బొమ్మ కంటి శ్రవణ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బొడ్ల భరత్ బాబులను నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జెఏసి చైర్మన్ తొగరి కరుణాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు రాజ్యాంగబద్ధంగా ఎమ్మెల్సీ గవర్నర్ కోటాలో నియమించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు అలాగే జర్నలిస్టులకు 1000 కోట్ల ప్రత్యేక బడ్జెట్ను ఏర్పాటు చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ఒక్క జర్నలిస్టులో కూడా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనమండలిలో జర్నలిస్ట్ ఎమ్మెల్సీలు ఉన్నట్లయితే జర్నలిస్టుల ప్రాథమిక హక్కుల కోసం పోరాటం చేసి వారికి రావాల్సిన నిధులు గాని ఆర్థిక సహాయం కానీ అందేలా పోరాటం చేస్తారని హితవు పలికారు. టీచర్స్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఇతర ఎమ్మెల్సీలు వారి వారి స్వలాభం కోసమే ఉన్నాయని సమాజ హితం కోరే జర్నలిస్టులకు ఎందుకు ఎమ్మెల్సీ ఉండకూడదని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్ సమావేశాల్లో జర్నలిస్టులకు ఎంత బడ్జెట్ కేటాయించారు శ్వేత పత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ తొగరి కరుణాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు అధికారులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాచారాన్ని చేరవేసే జర్నలిస్టులకు ఎమ్మెల్సీ ఉండకూడదోనని, ప్రభుత్వమే సమాధానం చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు గవర్నర్ కోటాలో మూడు ఎమ్మెల్సీలు కేటాయించే వరకు జేఏసీ తరఫున పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరికలు జారీ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు ఎమ్మెల్సీ ఇచ్చేలా మాట్లాడాలని కోరారు. అక్టోబర్ నెలలో హైదరాబాద్ లో జరిగే జర్నలిస్టుల సమరభేరి కార్యక్రమంలో సంఘాల కతీతంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు మిత్రులందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఎలా సాధ్యమైందో తెలంగాణ జర్నలిస్టులకు మూడు ఎమ్మెల్సీ స్థానాలు సాధించుకునే దిశగా జేఏసీ పనిచేస్తుందని తెలిపారు.

# 12న జాతీయ లోక్ అదాలత్




జగిత్యాల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మట్టా సరిత తెలిపారు. జిల్లా కోర్టు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇరుపక్షాల సమ్మతితో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, చెక్కు బౌన్స్, మోటారు వాహన చట్టం, బ్యాంకు, చిట్‌ఫండ్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.

# తాత మధు ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయాలి: కాంగ్రెస్

గంగాధర, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ ఎక్స్‌రోడ్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్ మాట్లాడుతూ.. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమేనన్నారు. వ్యాఖ్యలు చేసిన తాత మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుల అహంకారపూరిత వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి రొమాల రమేష్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముద్దం నగేష్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అవోప అధ్యక్షుడిగా కట్కూరి సంతోష్‌కుమార్

జగిత్యాల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోప) జగిత్యాల పట్టణ యూనిట్ అధ్యక్షుడిగా కట్కూరి సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి సంతోష్‌కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల అధికారులు ఆయన ఎన్నికను ఏకగ్రీవంగా ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఎన్నికల అధికారులుగా పాత సుధాకర్, పిప్పరి శ్రీనివాసమూర్తి, పరిశీలకులుగా జిల్లా అవోప ప్రధాన కార్యదర్శి కటుకం రాజేష్‌కుమార్, కోరుట్ల పట్టణ అవోప అధ్యక్షుడు కోటగిరి మహేష్ వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సంతోష్‌కుమార్‌ను పలువురు సభ్యులు పూలమాలలు వేసి అభినందించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతానికి, ఆర్యవైశ్యుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, సంఘ సభ్యులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# టౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలి

### ఎస్పీకి ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడి ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): జగిత్యాల టౌన్ సీఐ పి.కరుణాకర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ.బారీ మంగళవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బారీ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 4న ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో తాను విజయం సాధించి, ఎన్నికల కమిటీ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటికి వెళుతుండగా కమ్యూనిటీ హాల్ వద్దకు వచ్చిన టౌన్ సీఐ తనను ఇంటికి వెళ్లనివ్వకుండా అక్కడే ఉండాలని సూచించారని పేర్కొన్నారు. ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో మూడు సార్లు రీకౌంటింగ్ నిర్వహించినా తానే విజయం సాధించినట్లు తెలిపారు. అయినప్పటికీ సీఐ ఎన్నికల కమిటీ సభ్యులను తిరిగి ఎన్నికలు నిర్వహించాలని కోరడం సమంజసం కాదన్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి టౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.




# చిన్నారుల గుండె చికిత్సలకు ప్రభుత్వ చేయూత

### సీఎం సహాయనిధి ద్వారా ఎల్ఓసీ అందజేత

జగిత్యాల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ తెలిపారు. ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు ప్రభుత్వ సహకారంతో గుండె శస్త్రచికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని కొనాపూర్‌కు చెందిన పంగ విజయ్ కుమార్తె గుండె శస్త్రచికిత్స కోసం సీఎం సహాయనిధి ద్వారా ఎల్ఓసీ అందజేశారు. తాళ్ల ధర్మారం గ్రామానికి చెందిన గంగాదరి సుమన్ కుమారుడికి శస్త్రచికిత్స అవసరం ఉండటంతో కుటుంబాన్ని పరామర్శించారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ప్రత్యేక వైద్య బృందం ఆధ్వర్యంలో వారం రోజులపాటు సుమారు 25 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. లండన్‌కు చెందిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డా. రమణరావు ధన్నాపూనేని, ఆర్మ్డ్ ఫోర్సెస్ వైద్యులు డా. నిఖిల్, నిమ్స్ డైరెక్టర్ డా. రాహుల్ దేవరాజ్, డా. ప్రవీణ్ సహకారంతో కార్యక్రమం కొనసాగుతోందన్నారు. చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందించడమే కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.

# రేవంత్ పాలనకు చరమగీతం: జీవన్‌రెడ్డి



జగిత్యాల, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. హామీల అమలుకు డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగిత్యాలలో మంగళవారం భారీ ర్యాలీ, మెరుపు ధర్నా నిర్వహించారు. జీవన్‌రెడ్డి నివాసంలోని తెలంగాణ భవన్ నుంచి వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పార్టీ జెండాలతో తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి రహదారిపై బైఠాయించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2,500, రైతు బీమా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా సరఫరాపై ఆంక్షలు ఎత్తివేసి, యాప్‌ను తొలగించాలని కోరారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని విమర్శించారు. సబితా ఇంద్రారెడ్డిపై జరిగిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు కౌరవ సభను తలపించిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మున్ను బాయ్, చల్ గల్ సర్పంచ్ జున్ను రాజేందర్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ముఖాసీర్ అలీ నిహాల్, ఇర్షాద్, తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటాపూర్‌లో ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



రామాయంపేట, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): వాల్మీకి బోయ సమాజం ఆధ్వర్యంలో వెంకటాపూర్‌లో వాల్మీకి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండప పూజ, కలశ స్థాపన నిర్వహించగా, సెప్టెంబర్ 5న మహాశాల ప్రవేశం, హోమాలు, వాస్తు రామాయణం చేపట్టారు. 6న వాస్తు రామాయణం, హోమాలు నిర్వహించి, 7న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వాల్మీకి మహర్షి ఆశయాలు, బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన ధర్మమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు. వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠతో వెంకటాపూర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందన్నారు. వాల్మీకి బోయ సమాజం ఐక్యతతో ముందుకు సాగుతూ విద్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు, సంఘం నాయకులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# భీమన్నకు 52.22 లక్షల ఆదాయం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): చివరి శ్రావణ సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ భారీగా నెలకొంది. ఒక్కరోజులో సుమారు 1.10 లక్షల మంది భక్తులు భీమేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు నిర్వహించిన వివిధ అర్జిత సేవలు, అభిషేకాలు, కల్యాణోత్సవాలు, ప్రత్యేక పూజల ద్వారా హుండీ ఆదాయం మినహాయించి రూ.52,22,473 ఆదాయం సమకూరింది. శ్రావణ మాసంలో ఒక్కరోజులో నమోదైన ఆదాయాల్లో ఇదే అత్యధికమని, ఆలయ చరిత్రలో హుండీ ఆదాయం మినహాయించి ఒక్కరోజులో నమోదైన ఆదాయాల్లో ఇది రెండో అత్యధికమని అధికారులు వెల్లడించారు. తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివరాలను ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.

### బద్ది పోచమ్మకు బోనాల సందడి

బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భీమేశ్వర స్వామిని 1,18,776 మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బద్ది పోచమ్మ అమ్మవారికి మహిళా భక్తులు పెద్ద ఎత్తున బోనాలు, ఒడిబియ్యం, చీర-సారె, బెల్లం, సాక, పట్నాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ అర్ధరాత్రి వరకు కొనసాగగా, మరుసటి రోజు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి ఆదేశాల మేరకు డిప్యూటీ ఈవో ప్రతాప్ నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్లు, బోనాల సమర్పణ ప్రాంగణాలు, నైవేద్యాల కేంద్రాల వద్ద తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో రద్దీని క్రమబద్ధీకరించారు. ఏఈవో మహేష్, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బందితో పాటు ఎస్పీఎఫ్, హోంగార్డులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ప్రజాపాలనా.. ప్రజా వ్యతిరేక పాలనా?

### బీఆర్ఎస్ నేతల అరెస్టులు ప్రజాస్వామ్యంపై దాడి

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మధురానగర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం వినతిపత్రం సమర్పించి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు నల్ల టీషర్టులతో వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆరోపించారు. మహిళా నాయకురాళ్ల పట్ల అనుచితంగా వ్యవహరించడం, కేటీఆర్, హరీశ్‌రావు తదితర నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై కేసులు, అరెస్టులు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా? అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

# గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఉషారాణి



సికింద్రాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు) : గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ తోట ఉషారాణి బాధ్యతలు చేపట్టారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఉషారాణిని గాంధీ సూపరింటెండెంట్‌గా నియమిస్తు ప్రభుత్వం ఆదేశాల జారీ చేసిన నేపథ్యంలో ఆమె మంగళవారం పదవీబాధ్యతలు చేపట్టారు. గాంధీఆస్పత్రి పాలన యంత్రాంగం ఆమెకు సాదరంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతు అందరి సహాయ సహకారాలతో నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. తనకు పదవీబాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, డీఎంఈ వాణిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సెప్టెంబరు 16న రాష్ట్ర స్థాయి 'డాక్ అదాలత్'

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): తెలంగాణ తపాలా శాఖ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 16న మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర స్థాయి 'డాక్ అదాలత్' నిర్వహించనుంది. హైదరాబాద్ సీపీఎమ్‌జీ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. పోస్టల్ సేవలపై సమస్యలు ఉన్నవారు సెప్టెంబరు 9 సాయంత్రం 5:45 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. కవర్‌పై "డాక్ అదాలత్" అని రాసి హైదరాబాద్ సీపీఎమ్‌జీ కార్యాలయానికి ఉత్తరం పంపవచ్చు. ఫిర్యాదులో ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ తప్పక పేర్కొనాలి. వర్చువల్ లింక్ ఫోన్‌కు అందుతుంది.

# సంకేపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): సంకేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన కుటుంబాలకు గ్రామ సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్ కార్డులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో జీపీఓ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపసర్పంచ్ పండుగ శంకరయ్య, వార్డు సభ్యులు రెడ్డవేణి రాజు, జెట్టి రాధా, అజిజ్, రేషన్ డీలర్ కాచం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ (ఏఏఎఫ్ఏ) ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యత, ఆరోగ్య పరిరక్షణలో దాని ఉపయోగం, వ్యాక్సిన్‌పై ఉన్న అపోహలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ఏఏఎఫ్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం విజయ్‌యాదవ్, జిల్లా కార్యదర్శి సాయి చరణ్, టౌన్ ప్రెసిడెంట్ కర్రు తిరుపతి, విక్రమ్‌యాదవ్, పిట్టల మనోహర్, పబ్బ రవి, పండుగ నితిన్, ప్రేమ్, శివాజీ, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడికి కృత్రిమ కాలు అందజేత

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 8 (ఈవార్తలు): ప్రమాదంలో కుడికాలు కోల్పోయి ఐదేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగుడు తిరుమాల్‌కు తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ చొరవతో కృత్రిమ కాలు అందజేశారు. గుంటూరుకు చెందిన తిరుమాల్ విధి నిర్వహణలో జరిగిన ప్రమాదంలో కుడికాలు కోల్పోయారు. అప్పటి నుంచి రోజువారీ పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న ఆయన పరిస్థితిని నరేష్ మెరుగు శివకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన శివకృష్ణ భారత్ వికాస్ పరిషత్ వికలాంగుల పునరావాస కేంద్రం ట్రస్టును సంప్రదించారు. ట్రస్టు సహకారంతో మంగళవారం తిరుమాల్‌కు కృత్రిమ కుడికాలు అమర్చారు. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇకపై రోజువారీ పనులను మరింత సులభంగా చేసుకునే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమానికి భారత్ వికాస్ ట్రస్ట్ మేనేజర్ నరేంద్ర, టెక్నీషియన్లు రఘు, మధు, స్వామి, చింతల విజయ్‌కుమార్, రఘువరన్ తదితరులు సహకరించారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో అనేక మంది దివ్యాంగులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన దివ్యాంగులకు విద్య, ఉపాధి, వైద్యం, వివాహం వంటి అంశాల్లో దాతలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అవసరంలో ఉన్న దివ్యాంగులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.



## భారీగా పెరగనున్న ఐఫోన్ 18 ధరలు

న్యూఢిల్లీ: ఆపిల్ ఐఫోన్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐఫోన్ 18 సిరీస్ లాంచ్‌కు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ధరలపై టెక్ వర్గాల్లో అంచనాలు మొదలయ్యాయి. ఈసారి టాప్ మోడల్ ధర భారత్‌లో రూ. 2 లక్షల మార్కును దాటవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. టెక్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ప్రారంభ ధర రూ. 1.55 లక్షల నుంచి రూ. 1.60 లక్షల మధ్య ఉండవచ్చు. అయితే, అధిక స్టోరేజ్ వేరియంట్లు, ముఖ్యంగా టాప్ ఎండ్ మోడల్ ధర రూ. 2 లక్షలకు పైగా ఉండే అవకాశం ఉంది. గత ఏడాది ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌తో పోలిస్తే ఈసారి ధరలు సుమారు రూ. 5,000 నుంచి రూ. 20,000 వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది మెమరీ చిప్‌లు, ఇతర విడిభాగాల ధరలు భారీగా పెరగడం, టీఎస్ఎంసీకి చెందిన సరికొత్త 2ఎన్ఎమ్ చిప్ టెక్నాలజీని వినియోగించడం, కెమెరా విభాగంలో కీలక అప్‌గ్రేడ్లు వంటి కారణాల వల్ల ధరలు పెరగనున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఇక, సెప్టెంబర్ 9న నిర్వహించనున్న ఆపిల్ ఈవెంట్‌లో ప్రో మోడల్స్‌తో పాటు, కంపెనీ తన మొట్టమొదటి ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా ఆవిష్కరించవచ్చని ప్రచారం జరుగుతోంది. దీనికి 'ఐఫోన్ డ్యుయో' అనే పేరు పెట్టవచ్చని తాజా నివేదికలు సూచిస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై ఆపిల్ సంస్థ ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## వాయు కాలుష్యంలో హైదరాబాద్ 19

**స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర వాయు కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకుల్లో ఆసక్తికరమైన ఫలితాన్ని సాధించింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. తీవ్ర శీతాకాలపు పొగమంచు, విషపూరిత గాలి ఉన్నప్పటికీ.. బెంగళూరు (32వ ర్యాంక్), శ్రీనగర్ (26వ ర్యాంక్) వంటి నగరాలను ఢిల్లీ వెనక్కి నెట్టడం గమనార్హం. అయితే, ఈ ర్యాంకులు నగరాల్లోని గాలి నాణ్యతకు ప్రతిబింబం కాదు. కాలుష్య నియంత్రణకు నగరాలు తీసుకుంటున్న చర్యల ఆధారంగానే ఈ సర్వేను నిర్వహించారు. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో అగ్రస్థానంలో నిలవగా, ఇండోర్ రెండో స్థానంలో, జబల్‌పూర్ (195 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాయి. ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గతేడాది 32వ స్థానంతో పోలిస్తే ఢిల్లీ తన ర్యాంకును మెరుగుపరుచుకోవడం విశేషం. ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో, పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.

## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో దోషికి ఉరిశిక్ష

**మరో ఇద్దరికి 20 ఏళ్లు, 13 ఏళ్ల జైలుశిక్ష**

తిరునల్వేలి: మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.




## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు

**రైల్వే మంత్రి కీలక ప్రకటన.. వచ్చే మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్**

ముంబై: భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్–వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.




# ఈవీ అమ్మకాల జోరు

ముంబై: భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 2026 ఆగస్టు నెలలో ఈవీ అమ్మకాలు మునుపెన్నడూ లేని విధంగా ఆల్–టైమ్ గరిష్ఠ స్థాయికి చేరాయి. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధితో మొత్తం 2,98,448 యూనిట్ల ఈవీలు అమ్ముడయ్యాయి. దీంతో మొత్తం ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగింది. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) మంగళవారం గణాంకాలను విడుదల చేసింది. ఫాడా నివేదిక ప్రకారం, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు, వాణిజ్య వాహనాలు.. ఇలా అన్ని విభాగాల్లోనూ ఆగస్టు నెలలో రికార్డు స్థాయి అమ్మకాలు నమోదవడం విశేషం. ఎప్పటిలాగే, ఈవీ ద్విచక్ర వాహనాల అమ్మకాలు 67.05 శాతం వృద్ధితో 1,83,204 యూనిట్లకు చేరాయి. ఈ విభాగంలో టీవీఎస్ మోటార్ 48,938 యూనిట్లతో అగ్రస్థానంలో నిలవగా, బజాజ్ ఆటో (41,114), ఏథర్ ఎనర్జీ (28,757) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ప్రముఖ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 29 శాతం తగ్గి 13,852 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల విక్రయాలు 25.28 శాతం పెరిగి 79,846 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ విభాగంలో బజాజ్ ఆటో (13,833) మొదటి స్థానంలో, మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ (12,806) రెండో స్థానంలో నిలిచాయి. ఇక ప్యాసింజర్ వాహనాల (కార్లు) అమ్మకాలు 51.89% వృద్ధితో 30,696 యూనిట్లకు పెరిగాయి. ఈ సెగ్మెంట్‌లో టాటా మోటార్స్ (13,158), మహీంద్రా అండ్ మహీంద్రా (6,464), జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా (4,622) టాప్–3లో ఉన్నాయి. కొత్తగా మార్కెట్లోకి వచ్చిన విన్‌ఫాస్ట్ 2,199, టెస్లా 116 కార్లను విక్రయించాయి. అన్నింటికంటే వేగంగా వృద్ధి చెందిన విభాగం ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలే. గతేడాది ఆగస్టులో కేవలం 1,631 యూనిట్లు అమ్ముడవగా, ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగి 4,702 యూనిట్లకు చేరాయి.

# కాపర్‌కు డిమాండ్!

## లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో సరికొత్త రికార్డు

లండన్: అంతర్జాతీయ మార్కెట్లో రాగి (కాపర్) ధర చుక్కలనంటుతోంది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్ (ఎల్ఎంఈ)లో రాగి ధర చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. శుద్ధి చేసిన రాగిపై అమెరికా భారీగా సుంకాలు (టారిఫ్‌లు) విధించవచ్చన్న అంచనాలతో వ్యాపారులు పెద్ద ఎత్తున నిల్వలను అమెరికాకు తరలిస్తుండటమే ఈ అనూహ్య పెరుగుదలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇవాళ ట్రేడింగ్‌లో ఎల్ఎంఈలో మూడు నెలల కాపర్ ఫ్యూచర్స్ ధర 0.8 శాతం పెరిగి మెట్రిక్ టన్నుకు 14,533 డాలర్ల (రూ. 13.73లక్షలు)వద్ద ఆల్ టైమ్ హైకి చేరింది. ఈ ఏడాది జనవరిలో నమోదైన 14,527.50 డాలర్ల (రూ. 13.72లక్షలు) రికార్డును ఇది అధిగమించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాగి ధర సుమారు 17 శాతం పెరగ్గా, గత 12 నెలల్లో ఏకంగా 47 శాతం మేర వృద్ధిని నమోదు చేసింది. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపైనా స్పష్టంగా కనిపిస్తోంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సెప్టెంబర్ కాపర్ ఫ్యూచర్స్ 1.21 శాతం (రూ. 16.8) పెరిగి ఉదయం 10:30 గంటలకే రూ. 1,403.50 ఇంట్రాడే గరిష్టాన్ని



తాకింది. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ షేర్లు కూడా బీఎస్ఈలో 5 శాతానికి పైగా లాభపడి రూ. 537.35 వద్ద ట్రేడ్ అయ్యాయి. రాగి ధరల పెరుగుదలకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక కారణాలు రెండూ ఉన్నాయి. డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, పవర్ గ్రిడ్ల నుంచి డిమాండ్ విపరీతంగా పెరుగుతుండగా, పాత గనుల నుంచి ఉత్పత్తి ఆ స్థాయిలో పెరగడం లేదు. ఇది దీర్ఘకాలంగా ధరలకు మద్దతు ఇస్తోంది. అయితే, తాజా పెరుగుదలకు ప్రధాన కారణం అమెరికా టారిఫ్‌లకు సంబంధించిన పరిణామాలే. రిఫైన్డ్ కాపర్‌పై సుంకాల విషయంలో అమెరికా వాణిజ్య శాఖ జూన్ 30 నాటికి తన నివేదికను వైట్‌హౌస్‌కు ఇవ్వాల్సి ఉన్నా, రెండు నెలలు దాటినా తుది నిర్ణయం వెలువడలేదు. దీంతో వ్యాపారులు ముందుజాగ్రత్తగా తమ నిల్వలను అమెరికాకు తరలిస్తున్నారు. ఫలితంగా ఇతర ప్రాంతాల్లో, ముఖ్యంగా ఎల్ఎంఈ నెట్‌వర్క్‌లో రాగి లభ్యత తగ్గిపోయి ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు, 2026 మొదటి అర్ధభాగంలో ప్రపంచవ్యాప్తంగా రాగి గనుల ఉత్పత్తి దాదాపు 1 శాతం తగ్గగా, కాన్సన్‌ట్రేట్ ఉత్పత్తి 2.6 శాతం క్షీణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలా ఒకవైపు తగ్గుతున్న ఉత్పత్తి, మరోవైపు పెరుగుతున్న డిమాండ్, దానికి తోడు టారిఫ్ భయాలు.. అన్నీ కలిసి రాగి ధరలను రికార్డు స్థాయికి చేర్చాయి.

# అమెరికా ముక్కలు

## 'చైనా నోస్ట్రడామస్' సంచలన జోస్యాలు

బీజింగ్: భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రయత్నాలు ఎప్పటి నుంచో జరుగుతూనే ఉన్నాయి. అయితే కొన్ని అంచనాలు మాత్రం సోషల్ మీడియాలో ఒక్కసారిగా కలకలం రేపుతుంటాయి. ఇప్పుడు అలాంటి చర్చకు కారణమయ్యారు చైనా–కెనడాకు చెందిన విద్యావేత్త ప్రొఫెసర్ జియాంగ్ జ్యాకిన్. 'చైనా నోస్ట్రడామస్'గా పేరుగాంచిన ఆయన.. 2027లో అమెరికా ఎదుర్కొనే పరిణామాలపై చేసిన అంచనాలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. జియాంగ్ అంచనాల ప్రకారం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశం ఉంది. వైమానిక దాడులతో సమస్య పరిష్కారం కాకపోతే అమెరికా నేరుగా భారీ స్థాయిలో భూతల యుద్ధంలోకి దిగే పరిస్థితి రావచ్చని ఆయన భావిస్తున్నారు. ఈ యుద్ధం ఏళ్ల తరబడి కొనసాగుతుందని చెబుతున్నారు. యుద్ధం సుదీర్ఘంగా సాగితే అమెరికా సైన్యంలో సిబ్బంది కొరత ఏర్పడొచ్చని జియాంగ్ అంచనా. దీంతో తప్పనిసరి సైనిక సేవకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను 2027 నాటికి సిద్ధం చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. యువతను సైన్యంలోకి తీసుకునే పరిస్థితి రావచ్చని అన్నారు. అమెరికాలో అంతర్గత పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా మారొచ్చని ఆయన అంచనా వేశారు. ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ ఐసీఈ అధికారాలు మరింత పెరగవచ్చని అన్నారు. ప్రధాన నగరాల్లో నేషనల్ గార్డ్ మోహరింపులు తరచుగా కనిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. హార్మూజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని జియాంగ్ చెబుతున్నారు. చమురు, గ్యాస్, ఎరువుల ధరలు భారీగా పెరగొచ్చని అంచనా వేశారు. సరఫరా వ్యవస్థలు దెబ్బతింటే ఆహార కొరత, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, తప్పనిసరి సైనిక సేవపై వ్యతిరేకత, వీధుల్లో భద్రతా బలగాల మోహరింపులు కలిసి అమెరికాలో తీవ్ర అశాంతికి దారితీయొచ్చని జియాంగ్ అభిప్రాయపడ్డారు. 2027లో అంతర్యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. జియాంగ్ మరో సంచలన అంచనా కూడా వెలువరించారు. డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అమెరికా అధ్యక్షుడయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి వీల్లేదు. అయినప్పటికీ ట్రంప్ మూడోసారి అధికారంలోకి రావచ్చని జియాంగ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అమెరికాలో అంతర్యుద్ధం జరిగితే దేశం చిన్న చిన్న ప్రాంతాలుగా విడిపోయే పరిస్థితి రావచ్చని ఆయన మరోసారి వ్యాఖ్యానించారు. దీన్నే 'బాల్కనైజేషన్'గా పేర్కొన్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత అమెరికా క్రిస్టియన్ ఏఐ థియోక్రసీగా మారుతుందని కూడా ఆయన అంచనా వేశారు. ఆస్టిన్ భవిష్యత్తులో అమెరికాకు కొత్త కేంద్రంగా మారొచ్చని.. న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ ప్రాధాన్యం తగ్గొచ్చని అన్నారు. అయితే ఇవన్నీ జియాంగ్ జ్యాకిన్ చేసిన అంచనాలు మాత్రమే. వాటికి కచ్చితమైన ఆధారాలు ఉన్నాయని చెప్పలేం. భవిష్యత్తులో అవే పరిణామాలు జరుగుతాయని నిర్ధారించేందుకు ప్రస్తుతం ఎలాంటి ఆధారం లేదు. అందుకే ఈ వ్యాఖ్యలను విశ్లేషణలు, అంచనాలుగానే చూడాలి.



## ఉల్లి ఘాటు, చికెన్ జోరు

**మళ్లీ పెరిగిన ఇంటి ఖర్చు**

న్యూఢిల్లీ: సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై ధరల భారం మరోసారి పెరిగింది. ఆగస్టు నెలలో గృహావసర భోజనం ఖర్చులు స్వల్పంగా పెరిగినట్లు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ 'క్రిసిల్' తన తాజా నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా ఉల్లిపాయలు, వంట నూనెలు, బ్రాయిలర్ చికెన్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. క్రిసిల్ 'రోటీ రైస్ రేట్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే శాకాహార భోజనం (వెజ్ థాలీ) ధర 1 శాతం పెరిగి రూ. 29.5కి చేరింది. అదే సమయంలో, మాంసాహార భోజనం (నాన్–వెజ్ థాలీ) ధర 5 శాతం పెరిగి రూ. 57.5కు చేరింది. అయితే, జూలై నెలతో పోల్చితే నాన్–వెజ్ థాలీ ధర 1 శాతం తగ్గడం గమనార్హం. ఈ ధరల పెరుగుదలకు ప్రధానంగా ఉల్లి ధరలు ఏకంగా 43 శాతం మేర పెరగడమే ముఖ్య కారణం. మార్చి–ఏప్రిల్ నెలల్లో మహారాష్ట్రలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానల ప్రభావంతో సరఫరా తగ్గి ఉల్లి ధర కిలోకు రూ. 40కి చేరింది. వీటికి తోడు వంట నూనెల ధరలు 11 శాతం, ఎల్పీజీ ధరలు 10 శాతం, బ్రాయిలర్ చికెన్ ధరలు 10 శాతం మేర పెరిగాయి. నాన్–వెజ్ థాలీ ప్రియం కావడంలో చికెన్ ధరల పెరుగుదల కీలక పాత్ర పోషించింది. మరోవైపు బంగాళాదుంపల ధరలు 12 శాతం, టమాటా ధరలు 28 శాతం మేర తగ్గడంతో వెజ్ థాలీ ధరలు మరింత పెరగకుండా కొంతమేర అదుపులో ఉన్నాయి. ఇక జూలై నెలతో పోలిస్తే, శ్రావణ మాసం కారణంగా చికెన్ వినియోగం తగ్గి బ్రాయిలర్ ధరలు 4 శాతం మేర క్షీణించాయి. దీంతో నాన్–వెజ్ థాలీ ధరలో స్వల్ప తగ్గుదల కనిపించింది. అయితే, రబీ పంట సరఫరా తగ్గడం, ఖరీఫ్ పంట రాక ఆలస్యం కావడం వల్ల రాబోయే రెండు మూడు నెలల పాటు ఉల్లి ధరలు అధికంగానే ఉండే అవకాశం ఉందని క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పుషన్ శర్మ అంచనా వేశారు.

## ఇజ్రాయెల్‌తో వాణిజ్యంపై యూకే నిషేధం

లండన్: అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లతో వాణిజ్య సంబంధాలపై బ్రిటన్ (యూకే) ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ సెటిల్‌మెంట్ల నుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతితో పాటు ఫైనాన్సింగ్, నిర్మాణ రంగం వంటి సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బ్రిటన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా సైతం మద్దతు ప్రకటించడమే కాకుండా, తాము కూడా ఈ నిషేధంలో భాగస్వామ్యం పంచుకోనున్నట్లు వెల్లడించాయి. వెస్ట్ బ్యాంక్‌లోని పలు ప్రాంతాల్లో 'సెటిలర్ టెర్రరిస్టులు' పాలస్తీనియన్లపై జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనా ప్రజల ఇళ్లను కూల్చివేయడం, రహదారులు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సమాజం కళ్లముందే పాలస్తీనాలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల తాను సిగ్గుపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ఆండీ బర్న్‌హమ్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ విషయంలో యూకే తన విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది బ్రిటన్ ప్రభుత్వం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. బ్రిటన్ నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఇది 'తీవ్రమైన తప్పుడు అంచనా' అని, తమ ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మండిపడ్డారు. "బ్రిటన్ మాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, మేము కూడా బ్రిటన్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ చర్యను 'యూదు ప్రజలపై చూపిస్తున్న వివక్ష'గా అభివర్ణించారు. దీనికి ప్రతిగా అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండవచ్చని ఆయన సంకేతాలిచ్చారు. ఈ ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో, బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం ఫోన్లో మాట్లాడినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.

## ఐఫోన్ ఫోల్డబుల్ వచ్చేది ఈ ఏడాదే!

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్, 2026 సంవత్సరంలో భారత మార్కెట్‌లో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఐఫోన్ 18 సిరీస్‌ను విడుదల చేయనుండగా, అమ్మకాల్లో భారీ వృద్ధిని నమోదు చేస్తుందని ప్రముఖ టెక్నాలజీ రీసెర్చ్ సంస్థ 'సైబర్ మీడియా రీసెర్చ్' (సీఎంఆర్) అంచనా వేసింది. ముఖ్యంగా యాపిల్ నుంచి వస్తున్న తొలి ఫోల్డబుల్ ఐఫోన్ కూడా ఇదే సమయంలో మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉండటంతో అమ్మకాలు గణనీయంగా పెరగవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సీఎంఆర్ ప్రాథమిక అంచనాల ప్రకారం.. 2026లో సాధారణ త్రైమాసికాల్లో యాపిల్ షిప్‌మెంట్ల వృద్ధి సగటున 20 శాతం ఉండగా, కొత్త ఐఫోన్ల విడుదల సమయంలో (లాంచ్ క్వార్టర్) ఇది ఏకంగా 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. గతేడాదితో పోలిస్తే లాంచ్ క్వార్టర్‌లో దాదాపు 4 శాతం వృద్ధి నమోదవుతుందని సంస్థ అంచనా వేసింది. ఈ వృద్ధిలో కొత్త మోడళ్ల పాత్ర కీలకంగా ఉండనుంది. ఐఫోన్ 18 ప్రో మోడల్ వాటా 8శాతం వరకు ఉండగా, అత్యంత ఖరీదైన ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ వాటా 5 శాతం వరకు ఉండవచ్చని సీఎంఆర్ నివేదిక పేర్కొంది.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
బుధవారం 9-9-2026, జగిత్యాల
www.evarthalu.com


## లవ్లీ చిత్రం



సోనాలీ రౌత్

### ప్రియాంక మోహన్..

# రీసెట్ చేస్తుందా!



హీరోయిన్ కెరీర్ లో కొన్ని సినిమాలు కేవలం హిట్స్ గా మిగిలిపోతాయి.. మరికొన్ని మాత్రం కెరీర్ మొత్తాన్నే మార్చేస్తాయి. ఇప్పుడు యంగ్ బ్యూటీ ప్రియాంక మోహన్ కు అలాంటి సినిమా అవసరమనే చర్చ జరుగుతోంది. వరుసగా పెద్ద హీరోల చిత్రాల్లో కనిపించిన తర్వాత.. ప్రస్తుతం ఆమె చేస్తున్న ప్రాజెక్టుల్లో పాత్రకు ఇస్తున్న ఇంపార్టెన్స్ ఆసక్తిని పెంచుతోంది. రాబోయే సినిమాల్లో ఏదైనా ఒక్క క్యారెక్టర్ క్లిక్ అయితే.. ప్రియాంక కెరీర్ రీసెట్ అయ్యే ఛాన్సులు కనిపిస్తున్నాయి. టాలీవుడ్, కోలీవుడ్ లో మంచి క్రేజ్ తెచ్చుకున్న ప్రియాంక మోహన్.. గ్యాంగ్ లీడర్, డాక్టర్, డాన్, కెప్టెన్ మిల్లర్, సరిపోదా శనివారం వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. వరుస అవకాశాలతో ఒకానొక టైమ్ లో టాలీవుడ్, కోలీవుడ్ లో మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఒకరిగా నిలిచారు. పవన్ కల్యాణ్ నటించిన ఓజీలో కూడా ఆమె కీలక పాత్రలో కనిపించారు. ఆ సినిమా తర్వాత ఆమె నుంచి వచ్చే మూవీలపై అందరి ఫోకస్ పడింది. అయితే ఇప్పుడు ప్రియాంక ఎంచుకుంటున్న ప్రాజెక్టులు మాత్రం ఒకేలా ఉండటం లేదు. విభిన్న కథలు, కొత్త కాంబినేషన్లు, యాక్టింగ్ కు స్కోప్ ఉన్న రోల్స్ వైపు ఆమె అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రియాంక మోహన్ చేతిలో కవిన్ తో ఓ సినిమా, మారి సెల్వరాజ్ దర్శకత్వంలో మంజనాత్తి ఉన్నాయి. వీటితో పాటు శింబు నటిస్తున్న అరసన్ లో కూడా ఆమె కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ సినిమాల్లో ఏదైనా స్ట్రాంగ్ రోల్ దక్కితే.. ఆమె కెరీర్ కు కొత్త ఊపు రావచ్చు. ముఖ్యంగా మారి సెల్వరాజ్ సినిమాల్లో కథ, పాత్రలకు స్పెషల్ ఇంపార్టెన్స్ ఉంటుంది. అందుకే మంజనాత్తి ప్రియాంకకు హీరోయిన్ గా కొత్త యాంగిల్ ను చూపించే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అలాగే అరసన్ కూడా ఆమెకు మరో కీలక అవకాశం కావచ్చు. శింబు లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న ఆ ప్రాజెక్టుపై ఇప్పటికే అంచనాలు ఉన్నాయి. ఇందులో ప్రియాంక రోల్ ఎలా ఉంటుంది? ఆమెకు ఎలాంటి క్యారెక్టర్ ఇచ్చారు? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు ప్రియాంకను ఎక్కువగా గ్లామర్, కమర్షియల్ హీరోయిన్ గా చూసిన ప్రేక్షకులకు.. ఇకపై ఆమె యాక్టింగ్ లో మరో యాంగిల్ కనిపించే అవకాశం ఉంది. అదే జరిగితే ఆమె కెరీర్ కు అది పెద్ద ప్లస్ అవుతుంది.



## నన్ను నేను ప్రేమించా: బిపాసా బసు

బాలీవుడ్‌లో ఒకప్పుడు నటీమణులు అంటే సన్నగా, నాజూగ్గా ఉండాలనే సంప్రదాయ భావనలు ఉండేవి. అయితే ఆ మూసధోరణులను తిరగరాస్తూ బాలీవుడ్‌లో కండలు తిరిగిన (మస్కులర్) శరీర ఆకృతితో ఫిట్‌నెస్‌కు సరికొత్త అర్థం చెప్పిన ఘనత నాదేనంటూ బిపాసా బసు చెప్పుకొచ్చారు. ఇటీవల ఓ ప్రముఖ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన బిప్స్ ఫిట్‌నెస్, ఆరోగ్యం , సినీ పరిశ్రమలో ఎదురయ్యే వయోభారం ఒత్తిళ్లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2000 ప్రారంభంలో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సమయాన్ని ఈ సందర్భంగా బిపాసా గుర్తు చేసుకున్నారు. ఆ కాలంలో చాలామంది నటీమణులు నాజూగ్గా, తెల్లగా, సున్నితమైన శరీర ఆకృతితో ఉండేవారని తెలిపారు. కానీ తాను మాత్రం పొడవుగా, అథ్లెటిక్ బిల్డ్‌తో, డార్క్ స్కిన్ టోన్‌తో అందరికంటే భిన్నంగా కనిపించేదాన్ని అన్నారు. ఆ రోజుల్లో మస్కులర్‌గా ఉన్న మహిళలను నటీమణులుగా అంగీకరించడం చాలా కష్టంగా ఉండేదని.. అయినా తాను భయపడకుండా ఆ ట్రెండ్‌ను ముందస్తుగా ప్రారంభించానని వెల్లడించారు.



## తోటి హీరోయిన్లకు త్రిష అండ

సినీ ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య సంబంధాల గురించి మాట్లాడితే ముందుగా వినిపించేది పోటీ అనే మాటే. ఒకే తరహా పాత్రలు, పరిమిత అవకాశాలు, స్టార్ హీరోల సినిమాల్లో చోటు కోసం పోటీ.. ఇలా హీరోయిన్ల మధ్య సహజంగానే ఒక రేస్ ఉంటుందనే అభిప్రాయం చాలాకాలంగా ఉంది. అయితే, ఆ పోటీకి భిన్నంగా మరో ప్రపంచం కూడా ఉంటుందని తాజాగా మాళవిక మోహనన్ చెప్పిన విషయాలు గుర్తు చేస్తున్నాయి. అదే ఒకరినొకరు ప్రోత్సహించుకునే హీరోయిన్ల మధ్య కనిపించని సపోర్ట్ సిస్టమ్. త్రిష లాంటి సీనియర్ స్టార్ విషయంలో సాధారణంగా ఆమె సినిమాలు, స్టార్‌డమ్, కెరీర్ గ్రాఫ్ గురించే ఎక్కువగా మాట్లాడుకుంటూ ఉంటారు. కానీ కొత్త తరం హీరోయిన్లను ఆమె ఎలా చూస్తారు? వారితో ఆమె వ్యక్తిగత సంబంధాలు ఎలా ఉంటాయి? అనే విషయం మాత్రం పెద్దగా బయటకు రాదు. ఇప్పుడు అదే త్రిష ఇమేజ్‌కు మరో కొత్త పార్శ్వాన్ని చూపిస్తోంది. ఇండస్ట్రీలో పరిచయాలు ఉండటం చాలా సాధారణం. ఒకే సినిమా సెట్లో కలిసి పనిచేయడం, ఈవెంట్లలో కలవడం కూడా కామనే. కానీ పరిచయం దాటి ఎదుటి వ్యక్తి ఎదుగుదలను నిజంగా ఆనందించడం మాత్రం వేరే విషయం. ముఖ్యంగా ఒకే రంగంలో, ఒకే స్థాయికి చేరుకునే ప్రయాణంలో ఉన్న ఇద్దరు హీరోయిన్ల మధ్య అలాంటి భావన ఉండటం మరింత ప్రత్యేకం. మాళవిక కెరీర్ జర్నీలో త్రిష చూపిన ఆప్యాయతను ఈ విధంగానే చూడొచ్చు. ఇది కేవలం ఇద్దరు హీరోయిన్ల మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్ మాత్రమే కాదు. ఇండస్ట్రీలో కొత్తగా అడుగుపెడుతున్న వారికి సీనియర్లు ఇచ్చే మోటివేషన్ ఎంత ముఖ్యమో చెప్పే ఎగ్జాంపుల్‌గా కూడా నిలుస్తోంది. స్క్రీన్‌పై హీరోయిన్లను తరచూ ఒకరితో ఒకరిని పోల్చడం, ఎవరి మార్కెట్ ఎక్కువ? ఎవరి సినిమాలు సక్సెస్ అవుతున్నాయి? అనే డిస్కషన్స్ జరుగుతుండటం సహజమే కానీ కెమెరా వెనుక మాత్రం ఒక హీరోయిన్ మరో హీరోయిన్ సక్సెస్ ను కోరుకోవడం కూడా జరుగుతుందనే విషయం ఇలాంటి సందర్భాల్లోనే బయటపడుతుంది. ఇదే హీరోయిన్ల మధ్య ఉండే సైలెంట్ సపోర్ట్ సిస్టమ్‌కు ఉదాహరణగా నిలుస్తోంది.

## కాకా మాస్ వెనక.. అసలు హార్ట్!

కాకాలో చిరంజీవికి రెండు గెటప్పులు ఉన్నాయి. ఒకవైపు నార్మల్ గా కనిపించే సత్యం, మరోవైపు అతని గతాన్ని గుర్తు చేసే రఫ్ లుక్. కానీ ఇప్పుడు మేకర్స్ సినిమా హార్ట్ ఎవరో కూడా చెప్పేశారు. అనస్వర రాజన్‌ను అమ్ములు పాపగా పరిచయం చేస్తూ హార్ట్ ఆఫ్ కాకా అని పేర్కొన్నారు. ఇప్పటివరకు యాక్షన్ వైపు వెళ్లిన ఫోకస్‌తో పాటు,




కథలో కూతురు పాత్రకు కూడా పెద్ద స్థానం ఉండబోతోందని ఈ పోస్టర్‌తో అర్థమవుతోంది. అమ్ములు మెడిసిన్ చదువుతున్న యువతిగా కనిపించబోతోంది. చేతిలో పుస్తకాలు, స్టెతస్కోప్‌తో చాలా సింపుల్‌గా ఫస్ట్ లుక్ ఇచ్చారు. ఆమె వెనక చిరంజీవి నీడను పెద్దగా చూపించారు. ఇది పోస్టర్ డిజైన్ మాత్రమే కావచ్చు. కానీ కాకా కథలో తండ్రి, కూతురు బంధం ముఖ్యంగా ఉంటుందనే టాక్ ఇప్పటికే వచ్చింది. పైగా గ్లింప్స్‌లో కూడా సత్యం కూతురు ఇచ్చిన స్కూటర్ కీస్ గురించి చిన్న ప్రస్తావన వచ్చింది. చిరంజీవి పాత్రను బాబీ ఈసారి కొంచెం డిఫరెంట్ గా హైలెట్ చేస్తున్నాడు. ఆక్వా ఇండస్ట్రీలో సూపర్వైజర్‌గా పనిచేసే సత్యం చాలా సాధారణమైన మధ్యతరగతి వ్యక్తి. యాక్షన్ కోసం గతంలోని యువ సత్యం ట్రాక్‌ను వేరుగా సెట్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుత సత్యం పాత్రలో తండ్రిగా ఎమోషన్‌కు కూడా స్పేస్ దొరుకుతోంది. వాల్తేరు వీరయ్యలో కూడా బాబీ మాస్‌తో పాటు కుటుంబ బంధాన్ని కథలో ఉపయోగించాడు. అక్కడ తమ్ముడి పాత్ర ఒక దశ తర్వాత కథలోకి వచ్చింది. కాకాలో మాత్రం కూతురు పాత్రను మొదటి నుంచే ముందు పెడుతున్నట్టు కనిపిస్తోంది. అమ్ములు పాపను హార్ట్ అని పిలవడం వల్ల ఆమె చుట్టూ కథలో ఏదైనా కీలకమైన సంఘటన ఉంటుందా అనే క్యూరియాసిటీ వస్తోంది.



## ఈశా సెంటర్‌లో సమంత

సమంత రూత్ ప్రభు కోయంబత్తూరులోని -ఈషా యోగా సెంటర్-ను మరోసారి సందర్శించారు. గత ఐదేళ్లుగా ఈ ఆధ్యాత్మిక కేంద్రంతో ఉన్న అనుబంధం తన జీవితంలో తెచ్చిన మార్పులను, వ్యక్తిగత ఎదుగుదలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా కొన్ని ప్రత్యేకమైన ఫోటోలను షేర్ చేసుకున్నారు. అక్కడ గడిపిన ప్రశాంతమైన క్షణాలతో పాటు తన మనసులోని భావాలను వివరిస్తూ ఒక సుదీర్ఘమైన స్ఫూర్తిదాయక నోట్‌ను పోస్ట్ చేశారు. సమంత తన పోస్ట్‌లో పేర్కొంటూ .. మిమ్మల్ని విస్తరింపజేసే.. మీ పరిధిని పెంచే వ్యక్తులను.. ప్రాంతాలను వెతుక్కోండి. జీవితంలో ఒకానొక దశకు వచ్చాక మన గురించి మనకు అన్నీ తెలుసని.. ఇవే మన బలాలు.. ఇవే మన పరిమితులు అని అనుకుంటూ ఉంటాం. బహుశా మనం ఇంతవరకే వెళ్లగలమని ఒక హద్దు గీసుకుంటాం అని తెలిపారు. ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత జీవితంలో ఎదురైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని ముందడుగు వేస్తున్న సమంత ఈ ఆధ్యాత్మిక మార్గం ద్వారా ఎంతో ఉపశమనాన్ని పొందుతున్నారు. సమంత షేర్ చేసిన ఈ ఫోటోలు ..తను రాసిన సందేశం ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. అగ్ర నటి సమంత సింప్లిసిటీకి.. ప్రశాంతమైన జీవనశైలికి అభిమానులు కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు.



## అనుపమ మిస్టేక్ ఎక్కడ?

మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చి 'ప్రేమమ్', 'అ ఆ', 'శతమానంభవతి' వంటి సినిమాలతో యూత్‌కు విపరీతంగా దగ్గరైన హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. అందం, నటన రెండూ ఉన్నా కూడా ఆమెకు ఇంకా 'స్టార్ హీరోయిన్' ట్యాగ్ రాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటున్నా, మిగతా యంగ్ భామల స్పీడ్‌తో పోలిస్తే అనుపమ ఎక్కడో వెనకబడిపోతోందనే చర్చ సోషల్ మీడియాలో విపరీతంగా సాగుతోంది. అనుపమ కెరీర్‌లో విజయాలకి తక్కువేమీ లేదు. 'రాక్షసుడు', 'కార్తికేయ 2', 'టిల్లు స్క్వేర్' తో పాటు గత ఏడాది వచ్చిన 'బైసన్', 'కిష్కింధపురి' లాంటి చిత్రాలు ఆమెకు నటిగా మంచి పేరు తెచ్చాయి. అయితే ఈ హిట్లన్నీ హీరోల క్రేజ్ వల్ల లేదా కాన్సెప్ట్ ఆధారంగా వచ్చిన విజయాలే కానీ, అనుపమ సోలో క్రేజ్‌ను పెంచేవిగా మారలేకపోయాయి. ఇక కంటెంట్ బాగుండి హిట్ సాధిస్తున్నప్పటికీ, ఒక స్టార్ హీరోయిన్‌కు ఉండే రేంజ్ అప్పీల్ ఆమెకు దక్కడం లేదనేది వాస్తవం. అనుపమ ఎక్కువగా పెర్ఫార్మెన్స్‌కు ప్రాధాన్యమున్న పాత్రలనే ఎంచుకుంటుంది. కానీ టాలీవుడ్ కమర్షియల్ ఫార్మాట్‌లో స్టార్ హీరోయిన్ స్టేటస్ రావాలంటే బడ్జెట్ సినిమాలు, అగ్ర కథానాయకుల సరసన నటించడం చాలా అవసరం. ఇక మమితా బైజు, ఖయాదు లోహర్ వంటి భామలు సరైన కమర్షియల్ ప్రాజెక్టులతో దూసుకుపోతుంటే, అనుపమ మాత్రం ప్రయోగాత్మక చిత్రాలు లేదా పక్కింటి అమ్మాయి పాత్రలకే ఎక్కువ పరిమితం కావడం వల్ల ఆమె స్టార్ డమ్ రేసులో వెనకపడుతోంది.

## ఒత్తిడిలోనే అసలైన గేమ్ ఆడతా: ఇషాన్

కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి పెరిగినప్పుడే తనలోని అత్యుత్తమ ఆట బయటకు వస్తుందని భారత బ్యాటర్, ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన తర్వాత అతడు తన ఆటతీరుపై ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. చెపాక్‌లో జరిగిన మ్యాచ్‌లో కిషన్ 334 బంతుల్లో 270 పరుగులు చేశాడు. ఇందులో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి.



అతడి ఇన్నింగ్స్‌తో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో కిషన్ 270 పరుగులు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడి తన ఆటకు మరింత ఉపయోగపడుతుందని కిషన్ చెప్పాడు. వికెట్లు త్వరగా పడిపోయిన సందర్భాల్లో కూడా తాను బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తానన్నాడు. ప్రశాంతంగా ఉంటూనే దూకుడుగా ఆడటం తనకు బాగా కలిసొస్తుందని వివరించాడు. తన వ్యక్తిగత స్కోరుపై కాకుండా జట్టు లక్ష్యంపై దృష్టి పెట్టినట్లు కిషన్ తెలిపాడు. 400 పరుగులు పూర్తయితే ముందుగా 450కి చేరుకోవాలని.. తర్వాత 500 పరుగుల లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పాడు. ఇలా చిన్న చిన్న లక్ష్యాలుగా విడగొట్టుకోవడం వల్లే సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడగలిగానన్నాడు. చెపాక్‌లో పరిస్థితులు బ్యాటర్లకు అంత సులభంగా లేవని కిషన్ చెప్పాడు. మైదానం ఒకవైపు బౌండరీ చాలా దూరంగా ఉండటంతో షాట్లకు ఎక్కువ శ్రమ పెట్టాల్సి వచ్చిందన్నాడు. బంతి మెత్తబడటంతో బౌండరీలు సాధించడం మరింత కష్టంగా మారిందని తెలిపాడు. మహ్మద్ సిరాజ్ షార్ట్ బాల్స్ వేసినప్పుడు వికెట్ కోల్పోకుండా ఉండేందుకు తన బ్యాటింగ్ భంగిమను మార్చుకున్నట్లు కిషన్ చెప్పాడు. బంతిని బలంగా కొట్టే ప్రయత్నంలో వికెట్ చేజారకుండా జాగ్రత్త పడ్డానన్నాడు. కుమార్ కుషాగ్రతో కలిసి కిషన్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. కుషాగ్ర 132 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఆ తర్వాత కూడా కిషన్ అదే జోరును కొనసాగించాడు. 270 పరుగుల వద్ద లాంగ్‌ఆన్ సమీపంలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ట్రిపుల్ సెంచరీకి అతడు 30 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. తన భారీ ఇన్నింగ్స్‌లో షాట్లు ఆడేందుకు పెద్దగా రిస్క్ తీసుకోలేదని కిషన్ చెప్పాడు. సరైన బంతులను ఎంచుకుని ఆడటం తనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నాడు.

## ఆకిబ్ జావేద్ వల్లే పాక్ క్రికెట్ నాశం: గిల్లెస్పీ

పాకిస్థాన్ క్రికెట్ జట్టు టెస్టు కోచ్‌గా కొద్దికాలం పనిచేసిన ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ పేసర్ జాసన్ గిలెస్పీ.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై, ముఖ్యంగా చీఫ్ సెలెక్టర్ ఆకిబ్ జావేద్‌పై సంచలన ఆరోపణలతో విరుచుకుపడ్డాడు. ఆకిబ్ జావేద్ నియామకం తర్వాత తన పరిస్థితి దారుణంగా మారిందని, తనను తీవ్రంగా అవమానించి అధికారాలన్నీ లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ క్రికెట్ ప్రస్తుత దుస్థితికి ఆకిబ్ జావేదే కారణమని, అతను ఉన్నంతకాలం ఆ జట్టు బాగుపడదని అన్నాడు. 'ది టెలిగ్రాఫ్'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో గిలెస్పీ మాట్లాడుతూ.. "పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ.. ఆకిబ్ జావేద్‌ను చీఫ్ సెలెక్టర్‌గా నియమించిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అప్పటి నుంచి పాకిస్థాన్ క్రికెట్‌తో నా సంబంధం పూర్తిగా దెబ్బతింది. ఆకిబ్ వచ్చి అన్ని విషయాల్లోనూ తనే సర్వం అయ్యాడు. ప్రతిదీ తన నియంత్రణలోనే ఉండాలని చూశాడు" అని తెలిపాడు. ఈ అనుభవం తనను మానసికంగా ఎంతగా కుంగదీసిందో గిలెస్పీ వివరించాడు. "టెస్టు జట్టును చూసుకోవడం, ఆటగాళ్లు, సిబ్బందిని నిర్వహించడం, జట్టు ఎంపికలో కీలక పాత్ర పోషించడం వంటి బాధ్యతల నుంచి నన్ను పూర్తిగా తప్పించారు. ఏ విషయంలోనూ నాకు ఎలాంటి పాత్ర లేకుండా చేశారు. ఈ మొత్తం అనుభవం నన్ను నీరుగార్చింది. కోచింగ్‌పైనే విరక్తి కలిగింది. అసలు ఈ క్రీడలో కొనసాగాలా? వద్దా? అనేంతగా నన్ను నేను అనుమానించుకునేలా చేసింది" అని తన ఆవేదన వ్యక్తం చేశాడు.

## ఆఫ్ఘన్ సిరీస్‌కు వాషింగ్టన్ సుందర్ ఫిట్

ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు అతడు అందుబాటులో ఉంటాడు. అయితే స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సహా మరో ఇద్దరు ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. బుమ్రా ఇంకా మ్యాచ్ సిమ్యులేషన్ పూర్తి చేయలేదు. సెప్టెంబర్ 9న అతడు మ్యాచ్ సిమ్యులేషన్‌కు హాజరయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఆఫ్ఘన్ సిరీస్‌లో అతడిని ఆడించాలా? వద్దా? అనే దానిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోనుంది. సిరీస్ ప్రారంభానికి కేవలం నాలుగు రోజుల ముందు ఈ నిర్ణయం రావాల్సి ఉండటంతో బుమ్రా విషయంలో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి ఫిట్‌నెస్ పరీక్షలు, మ్యాచ్ సిమ్యులేషన్లు పూర్తి చేసుకున్నారు.








## పీకల్లోతు కష్టాల్లో
# సౌత్ జోన్

**మూడో రోజూ ఈస్ట్ జోన్ ఆధిపత్యం.. తిలక్ వర్మ ఒంటరి పోరాటం.. మిగతా బ్యాటర్లు విఫలం**

**దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. స్టార్ బౌలర్లు మహమ్మద్ షమీ, ముకేశ్ కుమార్ అద్భుత ప్రదర్శనతో చెలరేగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ పీకల్లోతు కష్టాల్లో పడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ ఇంకా 466 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది.**



ఈస్ట్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించగా, అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ (56) అజేయంగా నిలిచి ఒంటరి పోరాటం చేస్తుండగా, దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీతో రాణించాడు. అయినప్పటికీ, కీలక సమాయాల్లో బ్యాటర్లు బాధ్యతారాహిత్యంగా వికెట్లు పారేసుకోవడం సౌత్ జోన్‌ను దెబ్బతీసింది. ఈస్ట్ జోన్ బౌలర్లు పాత బంతితోనూ అద్భుతంగా రాణించారు. ముఖ్యంగా రివర్స్ స్వింగ్‌తో సౌత్ జోన్ బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. షమీ, ముకేశ్ కుమార్ చెరో రెండు వికెట్లు పడగొట్టి సౌత్ జోన్ పతనానికి కారకులయ్యారు. రికీ భుయ్, స్మరణ్ రవిచంద్రన్ వికెట్ల విషయంలో డీఆర్ఎస్ ఈస్ట్ జోన్‌కు అనుకూలంగా వచ్చింది. నారాయణ్ జగదీశన్, దేవదత్ పడిక్కల్ వంటి కీలక బ్యాటర్లు అనవసర షాట్లకు ప్రయత్నించి పెవిలియన్ చేరారు. మొత్తం మీద, ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీకి తోడు బౌలర్లు కూడా రాణించడంతో ఈస్ట్ జోన్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది. తిలక్ వర్మ క్రీజులో ఉన్నప్పటికీ, సౌత్ జోన్ ఈ మ్యాచ్‌లో ఓటమి నుంచి గట్టెక్కడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది.

## పదేళ్లు వెనక్కి వెళ్లిపోయాం: సయీద్ అజ్మల్




పాకిస్థాన్ క్రికెట్ జట్టు పదేళ్లు వెనక్కి వెళ్లిపోయిందని ఆ దేశ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. జట్టులో తరచూ మార్పులు చేయడం వల్ల ఆటగాళ్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని విమర్శించాడు. ఆటగాళ్లకు తగినన్ని అవకాశాలు ఇవ్వకుండా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అవమానిస్తోందని ఆరోపించాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో పాకిస్థాన్ కొత్త జట్టుతో బరిలోకి దిగిన నేపథ్యంలో అజ్మల్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఇప్పటికే రెండు టెస్టుల్లో ఓడిన పాకిస్థాన్.. చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి 0–3 వైట్‌వాష్ నుంచి తప్పించుకోవాలని చూస్తోంది. ఇటీవల జట్టులో భారీ మార్పులు జరిగాయి. ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపించారు. ఇద్దరు కోచ్‌లను కూడా మార్చారు. దీనిపై అజ్మల్ తీవ్రంగా స్పందించాడు. "ఆటగాళ్లను నిలదొక్కుకునేలా పీసీబీ అవకాశం ఇవ్వడం లేదు. బాగా ఆడిన వారిని కూడా జట్టు నుంచి తప్పించారు. కొంతమంది ఆటగాళ్లను బోర్డు అవమానించింది. ఇతరుల కంటే ఆటగాళ్లను ఎక్కువగా నిరుత్సాహపరిచింది బోర్డే" అని సయీద్ అజ్మల్ వ్యాఖ్యానించాడు. జట్టు హైపెర్ఫార్మెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావెద్, టెస్టు జట్టు బాధ్యతలు తీసుకున్న మైక్ హెసన్‌పైనా అతడు విమర్శలు చేశాడు. జట్టు వ్యవహారాలన్నింటినీ వీరిద్దరే నియంత్రిస్తున్నారని ఆరోపించాడు. ఈ మొత్తం వ్యవహారం వెనుక వ్యక్తిగత అహంకారాలు ఉన్నాయని వ్యాఖ్యానించాడు. "మనం భవిష్యత్తు కోసం ప్రణాళికలు రూపొందించలేదు. జట్టు పదేళ్లు వెనక్కి వెళ్లిపోయింది" అని అజ్మల్ అన్నాడు. ఆటగాడు అత్యున్నత స్థాయిలో రాణించాలంటే వరుసగా అవకాశాలు ఇవ్వాలని అజ్మల్ అభిప్రాయపడ్డాడు. ప్రతి మ్యాచ్ కీలకమే అయినా, ఒక్క సిరీస్‌లో విఫలమైన ఆటగాడి స్థానంలో వెంటనే మరొకరిని తీసుకురావడం సరైన విధానం కాదన్నాడు. సల్మాన్ ఆఘా మంచి ఆటగాడేనని, కొన్ని కారణాల వల్ల అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడని చెప్పాడు.

## భారత్‌తో టీ20కి జపాన్ జట్టు ప్రకటన




క్రికెట్ ప్రపంచంలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టు, తొలిసారిగా జపాన్‌తో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడనుంది. ఇరు దేశాల మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రత్యేక మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 22న టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ చారిత్రక మ్యాచ్‌కు 'సుజుకీ కప్' అని పేరు పెట్టారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనే టకాయిచి మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్ 75' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇరు దేశాల మధ్య క్రీడా రంగంలో సహకారాన్ని, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడమే దీని లక్ష్యం. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగానే ఈ టీ20 మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ మ్యాచ్ ద్వారా జపాన్, తూర్పు ఆసియా దేశాల్లో క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మ్యాచ్ కోసం జపాన్ తమ జట్టును ప్రకటించింది. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన జట్టునే ఈ మ్యాచ్‌కు కూడా ఎంపిక చేయడం విశేషం. టీ20 ఫార్మాట్‌లో జపాన్ తరఫున అత్యధిక పరుగులు చేసిన కెండెల్ కడోవాకీ–ఫ్లెమింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ జేక్ కుసుడా–నైర్న్ తొలిసారిగా జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆసియా క్రీడల సన్నద్ధతకు ప్రాధాన్యత ఇస్తున్నందున, ఐసీసీ నిబంధనల ప్రకారం అర్హత ఉండి, ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం అనర్హులైన ఆటగాళ్లను ఈ మ్యాచ్‌కు ఎంపిక చేయలేదని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కెప్టెన్ ఫ్లెమింగ్‌తో పాటు ఇబ్రహీం తకహాషి, డెక్లాన్ సుజుకీ–మెక్‌కోంబ్ వంటి 50కి పైగా టీ20లు ఆడిన అనుభవజ్ఞులు జట్టులో ఉన్నారు. 2013లో తొలిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సుయోషి టకాడా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఈ చారిత్రక మ్యాచ్‌పై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా హర్షం వ్యక్తం చేశారు. "భారత్, జపాన్ మధ్య జరుగుతున్న ఈ ప్రత్యేక టీ20 మ్యాచ్‌లో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. భారత జట్టు ఒక కొత్త దేశంలో అడుగుపెడుతుండటం క్రికెట్‌కు ఒక ముఖ్యమైన ఘట్టం. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహబంధం ఉంది. 75 ఏళ్ల మైత్రి వేడుకల్లో క్రికెట్‌ను భాగం చేసినందుకు జపాన్ క్రికెట్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు" అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**జపాన్ జట్టు:**

కెండెల్ కడోవాకీ–ఫ్లెమింగ్ (కెప్టెన్), చార్లీ హరా–హింజే, బెంజమిన్ ఇటో–డేవిస్, అలెస్టిర్ కడోవాకీ–ఫ్లెమింగ్, కోహె కుబోటా, జేక్ కుసుడా–నైర్న్, వటారు మియాచి (వికెట్ కీపర్), రియో సకురానో–థామస్, అలెక్స్ షిరాయ్–పాట్‌మోర్ (వికెట్ కీపర్), షోమా సుగయా–స్లేటర్, డెక్లాన్ సుజుకీ–మెక్‌కోంబ్, సుయోషి టకాడా, ఇబ్రహీం తకహాషి, మకోటో తానియామా, లాచ్‌లాన్ యమమోటో–లేక్.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# అసెంబ్లీ.. అరుపుల వేదిక

ప్రజాస్వామ్యంలో అసెంబ్లీకి ఉన్న ప్రాధాన్యత అపారం. ప్రజలు తమ ఓటుతో ఎన్నుకున్న ప్రతినిధులు అక్కడికి వెళ్లేది అధికారాన్ని అనుభవించడానికి కాదు.. ప్రజల గొంతుకగా నిలవడానికి. గ్రామంలో తాగునీరు అందకపోయినా, రైతు పంటకు గిట్టుబాటు ధర దక్కకపోయినా, నిరుద్యోగి ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా, పేదవాడికి ఇల్లు మంజూరు కాకపోయినా.. ఆ బాధ అసెంబ్లీ గోడల మధ్య వినిపించాలి. అదే శాసనసభ అసలు ఉద్దేశం. కానీ తెలంగాణలో అసెంబ్లీ కార్యకలాపాలను చూస్తుంటే ఈ ప్రాథమిక స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతున్నదన్న ఆందోళన కలుగుతోంది. ప్రజల సమస్యలపై సమగ్ర చర్చ జరగాల్సిన చోట రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు, గత ప్రభుత్వాల లెక్కలు, పరస్పర దూషణలకే ఎక్కువ సమయం వెచ్చిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికార పక్షం ప్రతిపక్షాన్ని నిందించడం.. ప్రతిపక్షం అధికార పక్షంపై విరుచుకుపడటం.. ఈ వాదోపవాదాల మధ్య అసలు ప్రజా సమస్యలు మాత్రం పక్కకు వెళ్లిపోతున్నాయి. అసెంబ్లీ అనేది రాజకీయ సభ కాదు.. శాసనసభ. ఈ తేడాను ప్రజాప్రతినిధులు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రతి ఎమ్మెల్యేకు ఒక నియోజకవర్గం మాత్రమే కాదు.. రాష్ట్ర ప్రజలందరి సమస్యలపై మాట్లాడే బాధ్యత ఉంటుంది. తన నియోజకవర్గంలోని రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, సాగునీరు, ఉపాధి, భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రశ్నించాలి. తప్పులు ఉంటే ఎత్తిచూపాలి. మంచి నిర్ణయాలకు మద్దతివ్వాలి. అవసరమైతే ప్రత్యామ్నాయ విధానాలను సూచించాలి. అదే అసెంబ్లీ గౌరవం. ప్రజలు ఎమ్మెల్యేలను ఎన్నుకునేది టీవీ చర్చల్లో కనిపించేందుకు కాదు. సభలో తమ సమస్యలను వినిపించేందుకు. ఓటు వేసిన ప్రజలకు తమ ప్రతినిధి సభలో ఏం మాట్లాడుతున్నాడో తెలుసుకునే హక్కు ఉంది. తన నియోజకవర్గానికి ఏం సాధించాడో తెలుసుకునే హక్కు ఉంది. ప్రభుత్వాన్ని ఎన్ని ప్రశ్నలు అడిగాడో తెలుసుకునే హక్కు ఉంది. కానీ సభలో మైక్ దొరికిన ప్రతిసారీ ప్రత్యర్థి పార్టీపై దాడి చేయడమే ప్రధాన లక్ష్యంగా మారితే.. ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? తెలంగాణలో రైతు సమస్యలు తీరిపోయాయా? యువతలో నిరుద్యోగ ఆవేదన తగ్గిపోయిందా? ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల పరిస్థితి మెరుగుపడిందా? గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం సమస్యలు పరిష్కారమయ్యాయా? నగరాల్లో ట్రాఫిక్, వరదలు, చెత్త, కాలుష్యం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికిందా? పేదలకు ఇళ్లు, విద్య, వైద్యం, ఉపాధి అందరికీ అందుతున్నాయా?

# అమృత వర్షిణి.. ...తెలంగాణ భాష

ఒక జాతి జీవన విధానానికి, దాని చారిత్రక ఐడెంటిటీకి మాతృభాషే మూలస్తంభం. భాష కేవలం భావ వ్యక్తీకరణ సాధనమే కాదు, అది ఆ నేల సంస్కృతిని, శ్రమజీవుల స్వేదాన్ని, శతాబ్దాల పోరాటాల జ్ఞాపకాలను మోసే ఒక చారిత్రక నౌక. శతాబ్దాల రాజరికాల అణచివేతను, ఆధునిక కాలపు సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని ఒంటిచేత్తో ఎదుర్కొని, పల్లె ప్రజల గుండె చప్పుడుగా నిలిచి, చివరకు ఒక స్వరాష్ట్ర ఉద్యమానికి ఆత్మగా మారిన ఏకైక భాషా రూపం తెలంగాణ భాష! "తెలుగు భాషకు తల్లి వేరు తెలంగాణ" అని నిరూపించిన ఈ మట్టి భాష ప్రాచీనత, సౌందర్యం, పోరాట పటిమ అనన్య సామాన్యమైనది.

తెలంగాణ భాష నిన్నగాక మొన్న పుట్టుకొచ్చిన ఒక ప్రాంతీయ యాస మాత్రమే కాదు, అది తెలుగు భాషా వృక్షానికి అసలైన వేరు వ్యవస్థ. క్రీస్తుపూర్వం శాతవాహనుల కాలం నాటి కోటిలింగాల నాణేలపై లభించిన తొలి తెలుగు పదాల నుండి, క్రీ.శ. 6వ శతాబ్దపు కురవి శాసనంలో ఆవిష్కృతమైన ప్రథమ స్వచ్ఛమైన తెలుగు గద్యం వరకు తెలంగాణ నేలే తెలుగుకు తొలి వేదికైంది. సంస్కృత, గ్రాంథిక చట్రాలలో బంధించబడిన కవిత్వాన్ని వీధుల దాకా తెచ్చి, "జనముల నుడికారమున కావ్యము అల్లెదన్" అంటూ 12వ శతాబ్దంలోనే తొలి ప్రజాకవిగా నిలిచిన పాల్కురికి సోమనాథుడు, తన ద్విపద కావ్యాలతో తెలంగాణ దేశి తెలుగు బలాన్ని ప్రపంచానికి చాటాడు. మహాకవి పోతన భాగవత పద్యాల్లోని మట్టి వాసనలు, తెలంగాణ నుడికారాలే నేటికీ తెలుగు సాహిత్యానికి ఆభరణాలు.



తెలంగాణ నేలపై పుట్టిన ప్రతి పదానికీ ఒక చరిత్ర ఉంది. ప్రతి పలుకులో ఒక జీవితం ఉంది. ప్రతి యాసలో ఒక ఆత్మీయత ఉంది. తెలంగాణ భాష కేవలం మాట్లాడుకునే మాట కాదు, అది ఈ నేల ప్రజల కన్నీళ్లను, నవ్వులను, పోరాటాలను, ప్రేమను, పల్లె పరిమళాన్ని మోసుకొచ్చిన జీవన భాష. ఆ భాషకు గౌరవం తెచ్చిన మహనీయుల్లో కాళోజీ నారాయణరావు ఒకరు.

కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం వెనుక ఉన్న అసలు భావం ఒకటే....మన భాషను మనం ప్రేమించుకోవాలి. మన యాసను మనం గౌరవించుకోవాలి. మన సంస్కృతిని మనం కాపాడుకోవాలి.

తెలంగాణ భాషలో ఒక ప్రత్యేకమైన మాధుర్యం ఉంది.

"ఏమున్నవ్?", "ఎక్కడికెళ్తున్నవ్?", "తిన్నవా?", "రా బిడ్డా!" వంటి పలుకుల్లో కనిపించే ఆప్యాయతను కేవలం వ్యాకరణంతో కొలవలేం. ఆ మాటల్లో బంధం ఉంటుంది. మనిషిని మనిషికి దగ్గర చేసే వెచ్చదనం ఉంటుంది.

తెలంగాణ యాసలోని పదాలు పుస్తకాలలో పుట్టలేదు. అవి పొలాల్లో పుట్టాయి, పల్లెల్లో పెరిగాయి, చెరువుల గట్లపై వినిపించాయి, కూలీల చెమటలో తడిశాయి, అమ్మమ్మల కథల్లో తరతరాలకు ప్రయాణించాయి. అందుకే తెలంగాణ భాషలో జీవితం కనిపిస్తుంది.

తెలంగాణ సంస్కృతి కూడా అంతే వైవిధ్యభరితం. బతుకమ్మలో స్త్రీల ఆత్మగౌరవం కనిపిస్తుంది. బోనాల్లో భక్తి, సామూహికత కనిపిస్తాయి. ఒగ్గుకథలో జానపద కళ కనిపిస్తుంది. చిందు, డప్పు, జానపద గీతాల్లో పల్లె గుండె చప్పుడు వినిపిస్తుంది. చెరువులు, జాతరలు, పండుగలు, పల్లె పాటలు, ఇవన్నీ కలిసి తెలంగాణ సంస్కృతికి ఒక ప్రత్యేకమైన రూపాన్ని ఇచ్చాయి.

అయితే భాష అనేది కేవలం పదాల సమాహారం కాదు. భాష ఒక సమాజపు జ్ఞాపకం. సంస్కృతి ఒక జాతి ఆత్మ. ఒక భాషలోని ప్రత్యేకమైన పదాలు కనుమరుగైతే, వాటితో పాటు ఒక జీవన విధానం కూడా కనుమరుగవుతుంది.

నేటి ప్రపంచీకరణలో పిల్లలు, యువత ఇతర భాషలు నేర్చుకోవడం తప్పు కాదు. ఇంగ్లీష్ నేర్చుకోవాలి. హిందీ నేర్చుకోవాలి. ప్రపంచంతో మాట్లాడటానికి ఎన్నో భాషలు అవసరం. కానీ ఇతర భాషలు నేర్చుకోవడం కోసం మన భాషను మరచిపోవాల్సిన అవసరం లేదు.

మన పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడటం గొప్ప విషయమే. కానీ తమ అమ్మమ్మతో ఆమె భాషలో మాట్లాడగలగడం కూడా అంతే గొప్ప విషయం. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఇతర భాషలు అవసరం కావచ్చు, మన మూలాలను అర్థం చేసుకోవడానికి మాత్రం మన మాతృభాష అవసరం.

కాళోజీ మనకు నేర్పిన గొప్ప పాఠం ఇదే! భాష ప్రజలది. సాహిత్యం ప్రజల కోసం. కవి ప్రజల పక్షాన నిలబడాలి. ఆయన రచనల్లో తెలంగాణ ప్రజల జీవితం కనిపించింది. సామాన్యుడి బాధ ఆయనకు కవిత్వమైంది. అన్యాయంపై ఆయన స్వరం ప్రశ్నగా మారింది. అందుకే కాళోజీని కేవలం ఒక కవిగా కాకుండా, ప్రజాకవిగా గుర్తిస్తాము.

కాళోజీ జయంతిని జరుపుకోవడం అంటే ఆయన చిత్రపటానికి పూలమాల వేయడం మాత్రమే కాదు. ఆయన ఆలోచనలను మన జీవితంలోకి తీసుకురావడం. మన భాషను తక్కువగా చూడకుండా గర్వంగా మాట్లాడటం. మన పల్లె సంస్కృతిని ఆధునికత పేరుతో నిర్లక్ష్యం చేయకుండా సంరక్షించడం. మన పిల్లలకు మన జానపద కథలు, పాటలు, సామెతలు, పండుగల వెనుక ఉన్న అర్థాలను చెప్పడం.

తెలంగాణ భాషను కాపాడేది ప్రభుత్వాలు మాత్రమే కాదు, ప్రతి తెలంగాణ ఇంటి గడప.

తెలంగాణ సంస్కృతిని నిలబెట్టేది పుస్తకాలు మాత్రమే కాదు, ప్రతి కుటుంబం.

తెలంగాణ యాసను బతికించేది నిఘంటువులు మాత్రమే కాదు, మన నోటి మాట.

మన భాషను మాట్లాడుదాం.
మన యాసను గౌరవిద్దాం.
మన పండుగలను అర్థంతో జరుపుకుందాం.
మన జానపద కళలను ప్రోత్సహిద్దాం.
మన పిల్లలకు మన సంస్కృతిని అందిద్దాం.
ఎందుకంటే.....
భాషను కోల్పోతే మాటను కోల్పోతాం.
సంస్కృతిని కోల్పోతే మూలాలను కోల్పోతాం.
మూలాలను కోల్పోతే మనల్ని మనమే కోల్పోతాం.

కాళోజీ జయంతి మనకు ఒక పండుగ మాత్రమే కాదు...మన భాషను మనమే గౌరవించుకోవాలనే ఒక స్ఫూర్తివంతమైన పండుగ.

తెలంగాణ భాష బతికితే తెలంగాణ ఆత్మ బతుకుతుంది.

తెలంగాణ సంస్కృతి బతికితే మన తరాల జ్ఞాపకం బతుకుతుంది.

మన పలుకులో తెలంగాణ ఉండాలి.. మన బతుకులో తెలంగాణ కనిపించాలి.

కాళోజీకి అదే నిజమైన నివాళి.



**రమాదేవి (కులకర్ణి)**
హైదరాబాద్, 8985613123



# తెలంగాణ కోసం గొంతెత్తిన కాళోజీ

ఈ భాష ఈ వేషమెవరి కోసమురా..
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకు రా..
తెలుగు వాడివై తెలుగు రాదనుచు
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా.."

పరభాషలపై మోజుతో మాతృభాషను విస్మరిస్తున్న వారికి ఇంతకంటే సూటిగా, సూటిగా చెప్పాలంటే గుండెల్లో గుచ్చుకునేలా హెచ్చరించిన కవి మరొకరు ఉండరేమో. భాషను కేవలం సంభాషణ సాధనంగా కాకుండా.. మన అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. అందుకే ఆయన జయంతి తెలంగాణలో భాషా దినోత్సవంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. కాళోజీ అంటే ఒక కవి మాత్రమే కాదు. ఒక ఉద్యమం. ఒక గొంతు. ఒక తిరుగుబాటు. ఒక నిరంతర ప్రజా చైతన్యం. అన్యాయం ఎక్కడ కనిపించినా ప్రశ్నించిన ధైర్యం. అక్రమం ఎక్కడ జరిగినా ఎదిరించిన నిక్కచ్చితనం. పాలకులు ఎవరైనా.. వ్యవస్థ ఏదైనా.. ప్రజల పక్షాన నిలబడి తన కలాన్ని అక్షరాయుధంగా మలిచిన వైతాళికుడు. "నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు" అని గర్వంగా ప్రకటించిన కాళోజీ, తెలంగాణ ప్రజల జీవన భాషకు సాహిత్యంలో గౌరవం తీసుకొచ్చారు. పుస్తకాలలో కనిపించని ప్రజల పలుకును.. పల్లెల్లో వినిపించే యాసను.. సామాన్యుల ఆవేదనను.. వారి ఆనందాన్ని.. వారి ఆగ్రహాన్ని తన కవిత్వంలోకి తీసుకొచ్చారు. అందుకే కాళోజీ కవిత్వం చదివినప్పుడు అది కవితలా అనిపించదు.. మన పక్కింటి మనిషి మాట్లాడుతున్నట్టుగా అనిపిస్తుంది.

1914 సెప్టెంబరు 9న అప్పటి బీజాపూర్ ప్రాంతంలోని రట్టిహళ్లిలో జన్మించిన కాళోజీ కుటుంబం అనంతరం వరంగల్ ప్రాంతంలోని మడికొండలో స్థిరపడింది. మహారాష్ట్రకు చెందిన తండ్రి కాళోజీ రంగారావు, కన్నడ కుటుంబానికి చెందిన తల్లి రమాబాయమ్మల సంతానమైన ఆయనకు చిన్ననాటి నుంచే భాషల వైవిధ్యంతో పరిచయం ఏర్పడింది. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో పరిజ్ఞానం సంపాదించారు. అయితే ఎన్ని భాషలు నేర్చుకున్నా.. తన మాతృభాషపై ఉన్న మమకారాన్ని మాత్రం ఎన్నడూ కోల్పోలేదు. ఇదే నేటి తరానికి కాళోజీ అందించే గొప్ప సందేశం. పరభాష నేర్చుకోవద్దని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. పరభాష నేర్చుకుంటూ మాతృభాషను మరచిపోవద్దని చెప్పారు. అది నేటి సమాజానికి మరింత అవసరమైన హెచ్చరిక. ఆంగ్లం మాట్లాడితేనే విజ్ఞానం ఉన్నట్టుగా.. తెలుగు మాట్లాడటం నామోషీగా భావించే పరిస్థితి పెరుగుతోంది. పిల్లలకు తెలుగు పదాల కంటే విదేశీ పదాలే ఎక్కువగా పరిచయమవుతున్నాయి. ఇంట్లోనూ, మాధ్యమాల్లోనూ మాతృభాష వినియోగం క్రమంగా తగ్గుతోంది. మనమే మన భాషను తక్కువగా చూసుకుంటే.. దానికి పూర్వ వైభవం ఎవరు తీసుకొస్తారు?

కాళోజీ జీవితం భాషతోనే పరిమితం కాలేదు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆయన పోరాడారు. గ్రంథాలయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ తదితర ప్రజా ఉద్యమాలతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి వరంగల్‌లో గణపతి ఉత్సవాలు నిర్వహించారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేయడానికి ప్రయత్నించినందుకు నగర బహిష్కరణను ఎదుర్కొన్నారు. రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కూడా కాళోజీ తన గళాన్ని వినిపించారు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింపజేయాలనే సంకల్పంతో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాణంలో భాగస్వామి అయ్యారు. తెలంగాణ రచయితల సంఘం వంటి సంస్థలతో అనుబంధం పెంచుకున్నారు. రచయితగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమకారుడిగా, సామాజిక కార్యకర్తగా, రాజకీయ చైతన్యవంతుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. ఆయన కలం ఎప్పుడూ అధికారానికి వంగలేదు. "అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి.. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి.. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు" అని ప్రకటించిన కాళోజీకి 'గొడవ' అంటే వ్యక్తిగత కలహం కాదు.. ప్రజల కోసం చేసే పోరాటం. అందుకే ఆయన రచనల్లో సమాజం కనిపిస్తుంది. ఆయన గేయాల్లో ప్రజల ఆర్తి వినిపిస్తుంది. ఆయన వ్యంగ్యంలో పాలకుల వైఫల్యాలు ప్రతిబింబిస్తాయి.'నా గొడవ' ద్వారా సమకాలీన సామాజిక, రాజకీయ సమస్యలపై ఆయన నిర్మొహమాటంగా స్పందించారు. ఆయన కవిత్వం అందుకే కాలంతోపాటు నడిచింది. ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించిన సమస్యలను రాసినా.. వాటిలోని మానవీయత, ప్రజాస్వామ్య స్పృహ, అన్యాయంపై తిరుగుబాటు నేటికీ సజీవంగానే ఉన్నాయి. తెలంగాణ అస్తిత్వ ప్రశ్న వచ్చినప్పుడు కూడా కాళోజీ వెనుకడుగు వేయలేదు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆయన మద్దతు తెలిపారు. తెలంగాణ ప్రజల ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి, భాష, యాస, సామాజిక వాస్తవాలను అర్థం చేసుకున్న అసలైన తెలంగాణవాదిగా జీవితాంతం నిలిచారు. కాళోజీకి లభించిన గౌరవాలు ఎన్నో. పద్మ విభూషణ్‌తో పాటు అనేక సాహితీ, సామాజిక పురస్కారాలు ఆయనను వరించాయి. కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. అయితే కాళోజీకి ఆయనకు దక్కిన స్థానం. అందుకే ఆయనను ప్రజాకవిగా పిలుచుకోవడం కేవలం ఒక బిరుదు కాదు.. ప్రజలే ఇచ్చిన గౌరవం. "హింస తప్పు.. రాజ్యహింస మరీ తప్పు. సామాన్యుడే నా దేవుడు" అన్న కాళోజీ మాటలు ఆయన తాత్విక దృక్పథానికి అద్దం పడతాయి. అధికారం కంటే సామాన్యుడినే కేంద్రంగా చూసిన ప్రజాకవి ఆయన. 2002 నవంబరు 13న ఆయన భౌతికంగా దూరమైనా.. ఆయన గొంతు మాత్రం ఇంకా వినిపిస్తూనే ఉంది. ప్రత్యేకంగా భాష విషయంలో ఆయన హెచ్చరికను నేడు మనం మరింత గంభీరంగా తీసుకోవాలి. ప్రపంచంతో పోటీ పడేందుకు ఆంగ్లం అవసరం కావచ్చు. ఇతర భాషలు నేర్చుకోవడం విజ్ఞాన విస్తరణకు అవసరం కావచ్చు. కానీ అందుకోసం అమ్మలాంటి మాతృభాషను నిర్లక్ష్యం చేయడం మాత్రం ఆత్మవిస్మరణే. భాష చనిపోతే కేవలం కొన్ని పదాలు కనుమరుగుకావు. ఒక జాతి జ్ఞాపకాలు, సంస్కృతి, జీవన విధానం, భావ వ్యక్తీకరణ కూడా క్రమంగా కనుమరుగవుతాయి. అందుకే ఇంట్లో తెలుగు మాట్లాడాలి. పిల్లలకు తెలుగు చదవడం, రాయడం నేర్పాలి. తెలంగాణ పలుకుబడిని, యాసను అవమానంగా కాకుండా మన సాంస్కృతిక సంపదగా చూడాలి. ప్రజల భాషకు సాహిత్యంలోనూ, విద్యలోనూ, పరిపాలనలోనూ తగిన గౌరవం దక్కాలి.

కాళోజీని జ్ఞాపకం చేసుకోవడం అంటే ఆయన విగ్రహానికి పూలమాల వేయడం మాత్రమే కాదు. ఆయన ప్రశ్నించిన అన్యాయాన్ని ప్రశ్నించడం. ఆయన ప్రేమించిన మాతృభాషను ప్రేమించడం. ఆయన గౌరవించిన సామాన్యుడిని గౌరవించడం. ఆయన చూపిన ధైర్యంతో తప్పును తప్పుగా చెప్పడం. కాళోజీ జయంతి ఒక వేడుకగా ముగియకూడదు. అది మన భాషపై, మన సంస్కృతిపై, మన అస్తిత్వంపై మనం చేసుకునే పునఃప్రతిజ్ఞ కావాలి. తెలంగాణ పలుకుబడిలో ప్రజల మనసును పలికించిన ఆ ప్రజాకవికి అదే నిజమైన నివాళి. తెలుగు బతకాలంటే.. మనం తెలుగులో మాట్లాడాలి. తెలంగాణ పలుకు నిలవాలంటే.. మనం దాన్ని గౌరవించాలి. కాళోజీని స్మరించాలంటే.. ఆయన గొంతును కొనసాగించాలి.



**రామకిష్టయ్య సంగనభట్ల**
9440595494

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.